ప్రజాశక్తి
మంగళవారం 30 జనవరి 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

యువ ఓటర్లే నిర్దేశకులు

- 39 ఏళ్లలోపువారు 6.24 లక్షలు
- ఎన్నికల్లో కీలకపాత్ర వీరిదే..



ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

రాబోయే ఎన్నికల్లో యువ ఓటర్లే కీలకంగా మారనున్నారు. జిల్లాలో సంఖ్య రీత్యా రాజకీయ నిర్దేశం చేసే శక్తిని వీరు కలిగి ఉన్నారు. జిల్లాలో తుది ఓటర్ల జాబితా ప్రకారం 12,73,591 మంది ఓటర్లున్నారు. వీరిలో 18 నుంచి 39 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన యువ ఓటర్లు 6,24,772 మంది (49 శాతం) వున్నారు. చోడవరం, మాడుగుల, అనకాపల్లి, యలమంచిలి, పాయకరావుపేట, నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గాల్లో 18 నుంచి 39 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన ఓటర్లు 6,24,772 మంది వుండగా, 40-59 ఏళ్ల మధ్య ఓటర్లు 4,59,976 మంది, 60-79 మధ్య ఓటర్లు 1,75,285 మంది, 80 సంవత్సరాలు పైబడిన ఓటర్లు 13,558 మంది వున్నారు. 18-19 ఏళ్ల మధ్య ఓటర్లు 27,762 మంది కొత్తగా నమోదు చేసుకున్నారు. 18-19 ఏళ్ల నుంచి 80 సంవత్సరాలు పైబడిన ఓటర్ల వరకు అన్ని వయస్సుల ఓటర్లు ఎక్కువుగా పాయకరావుపేట నియోజకవర్గంలో వున్నారు.

నియోజకవర్గాల్లో వయస్సుల వారీ ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	18-19	20-29	30-39	40-49	50-59	60-69	70-79	80పైన	మొత్తం
చోడవరం	4,844	37,223	61,976	47,133	33,461	19,814	8,342	2,224	2,15,017
మాడుగుల	4,216	32,015	54,840	39,137	29,384	17,781	8,053	1797	1,87,223
అనకాపల్లి	4,930	42,381	57,845	42,590	32,191	19,542	9,252	2166	2,10,897
యలమంచిలి	4,636	37,436	58,520	42,352	30,352	19,557	8,947	2273	2,04,073
పాయకరావుపేట	4,944	46,697	70,061	49,087	38,850	23,600	11,187	3082	2,47,508
నర్సీపట్నం	4,192	35,784	62,232	43,019	32,420	20,108	9,102	2016	2,08,873
మొత్తం	**27,762**	**3,65,474**	**3,65,474**	**2,63,318**	**1,96,658**	**1,20,402**	**54,883**	**13,558**	**12,73,591**



విశాఖలో వినతులు స్వీకరిస్తున్న డిఆర్ఒ మోహన్‌కుమార్

మా సమస్యలు పరిష్కరించరూ...

- 'జగనన్నకు చెబుదాం'కు వినతుల వెల్లువ
- విశాఖ, అనకాపల్లిల్లో బారులు తీరిన అర్జీదారులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ కలెక్టరేట్‌లోనూ, జివిఎంసి ప్రధాన కార్యాలయంలోనూ సోమవారం తలపెట్టిన జగనన్నకు చెబుదాం (జెకెసి) కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. ప్రజలు తమ సమస్యలను తెలియజేస్తూ అర్జీలతో బారులుతీరారు. వచ్చిన అర్జీలపై అధికారులు నిర్దేశిత సమయంలో పరిష్కారం చూపాలని విశాఖ జిల్లా రెవిన్యూ అధికారి కె.మోహన్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో రెవిన్యూ డివిజనల్ అధికారి హుస్సేన్ సాహెబ్‌తో కలిసి ఆయన జెకెసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 266 మంది అర్జీదారులు నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మోహన్ కుమార్ మాట్లాడుతూ జెకెసి ద్వారా అర్జీదారులు లాభపడాలన్నారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ప్రజలకు సేవకులుగానే భావించి జవాబుదారీగా పనిచేయాలని సూచించారు. అధికారులు ఇచ్చిన సమాధానంతో అర్జీదారులు సంతృప్తి చెందకపోతే అర్జీలు రీఓపెన్ అవుతాయని, అటువంటి పరిస్థితి ఉండరాదని స్పష్టం చేశారు. సోమవారం నిర్వహించిన జెకెసికి 266 అర్జీలురాగా అందులో రెవిన్యూ శాఖకు చెందినవి 76, జివిఎంసి 60, మిగతా 2లో..

విద్యుత్ భారాలపై వామపక్షాల నిరసన

▶ వార్త మెయిన్‌లో..

14న జెడ్‌పి సర్వసభ్య సమావేశం

▶ వార్త 2లో..

ల్యాండ్ ఫిల్‌పై ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలి

▶ వార్త 5లో..

16న రవాణా రంగం బంద్

మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు)



నినాదాలు చేస్తున్న మోటారు ట్రాన్స్‌పోర్టు కార్మికులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం డిసెంబర్ 25న ఆమోదించిన హిట్ అండ్ రన్ 106 (2) చట్టానికి వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న రవాణా కార్మికులు దేశ వ్యాప్తంగా బంద్ చేపట్టనున్నట్టు విశాఖ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ తెలిపింది. ఈ బంద్‌ను ఉమ్మడి విశాఖ జిల్లాలో విజయవంతం చేయాలని రవాణా రంగ కార్మికులకు విజ్ఞప్తి చేసింది. సంఘం జిల్లా కమిటీ సమావేశం సోమవారం నగరంలో జరిగింది. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.జగన్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన రవాణా చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనే ప్రధాన డిమాండ్లతో బంద్ జరుగుతుందని చెప్పారు. ఏ చట్టం చేయాలన్నా లేక ఉన్న చట్టంలో సవరణలు చేయాలన్నా ప్రభుత్వం ముందుగా లా కమిషన్ ఆఫ్ ఇండియాను సంప్రదించాలన్నారు. అలాగే చట్టం వర్తించే తరగతికి చెందిన సంస్థలు, ప్రముఖులతో సంప్రదించాలని తెలిపారు. ప్రస్తుత కొత్త క్రిమినల్ చట్టాలు తేవడానికి ముందు ఈ సాంప్రదాయాలన్నింటినీ కేంద్రం ఉల్లంఘించిందని మండిపడ్డారు. కనీసం పార్లమెంటులోనైనా మిగతా 2లో..

నిబంధనలకు నీళ్లు

- నకిలీ బిల్డర్‌కి అండగా జివిఎంసి అధికారులు
- సింగిల్ యూనిట్‌కి అనుమతి తీసుకుని గ్రూప్ హౌస్ నిర్మాణం
- జోన్ - 5లో కొరవడిన పర్యవేక్షణ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

జివిఎంసి పర్యవేక్షణలో డొల్లతనం నకిలీ బిల్డర్లకు కాసుల వర్షం కురిపిస్తోంది. పలుచోట్ల టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో ప్లానింగ్ సెక్రటరీ నుంచి ఉన్నతాధికారుల వరకూ అందరూ అవినీతికి ఆజ్యం పోస్తున్నారు. మద్దతుగా సర్వేయర్లు తప్పుడు రిపోర్టులు ఇవ్వడంతో అంతటా అవినీతి రాజ్యమేలుతోంది. అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా అన్నరీతిన పరిస్థితి తయారైంది. సింగిల్ యూనిట్‌కు అనుమతి తీసుకుని గ్రూపు హౌస్ నిర్మాణం జరుపుతున్న ఘనులూ ఉన్నారు. నిర్మాణం ప్లాన్ ప్రకారం జరుగుతుందా ? లేదా ? ఏమైనా ఉల్లంఘన ఉందా ? అని ఎప్పటికప్పుడు సచివాలయం నుంచి పర్యవేక్షణ కొనసాగాల్సి ఉన్నా ఆ పని జరగడం లేదు. దీంతో జివిఎంసి పరిధిలో ఏకంగా బంజరు స్థలాన్ని కబ్జాచేసి దర్జాగా నిర్మాణం జరుపుతున్నాడు ఓ బడా నకిలీ బిల్డరు. ఆ సంగతేంటో ఓసారి చూద్దాం.

కబ్జా చేసి నిర్మాణం

జివిఎంసి 54వ వార్డు పరిధి జ్యోతినగర్, మర్రిపాలెం, డోర్ నెంబర్ 38-19-77/2, అసెస్‌మెంట్ నెంబర్ 1086250814, సర్వే నెంబర్ 69/1కి చెందిన జి.అప్పలరాజు, ఎం.రాంజీ అనే వ్యక్తులు గ్రౌండ్, ఫస్ట్ అండ్ సెకండ్ ఫ్లోర్ భవన నిర్మాణం కోసం జివిఎంసికి ప్లాన్ అప్లై చేశారు. జోన్ ఫైవ్ టౌన్ మిగతా 2లో..



నిబంధనలు అతిక్రమించి సాగుతున్న నిర్మాణం

మొదటి పేజీ తరువాయి..

నిబంధనలకు నీళ్లు

ప్లానింగ్ అధికారులు ఎలాంటి పర్యవేక్షణ జరపనందున బి. ఎ నెంబర్ 1086/5281/ బి/ జోన్5/ ఎంఐఎం/2022తో జి ప్లస్ వన్ సింగిల్ యూనిట్‌కి అనుమతి తీసుకుని ఎటువంటి సెట్ బ్యాక్స్ వదలకుండా దర్జాగా బిల్డర్ గ్రూప్ హౌస్ నిర్మాణం జరుపుతున్నారు. దీనిపై జోనల్ కార్యాలయానికి పలు ఫిర్యాదులు ఇప్పటికే అందాయి. అధికారులు పర్యవేక్షించి నిర్మాణానికి అడ్డుచెప్పి ఒకసారి మాత్రం ఆపించారు. అనుమతి వుంది కదా అధికారులు అడ్డు చెప్పడమేంటి అని అనుకోవచ్చు. ఈ అనుమతులన్నీ దొడ్డిదారిన పొందిన అనుమతులుగా ఉన్నతాధికారులు తాజాగా గుర్తించారు. పైగా ఈ బంజరు స్థలానికి ఎటువంటి డాక్యుమెంట్లూ లేవు. ఏమీ లేకుండా అధికారులు ఏవిధంగా భవన నిర్మాణానికి బి ఎ నెంబర్ జారీ చేశారో వారికే ఎరుక. ఈ కథ అంతా తెలుసుకున్న ఓ స్థానిక నాయకుడు బిల్డర్ వద్ద మామూళ్లు స్వీకరించి నిర్మాణదారునికి భరోసా ఇచ్చారు. దీంతో బిల్డర్ దర్జాగా నిర్మాణం చేస్తుండగా స్వయంగా జోనల్ కమిషనర్ పర్యవేక్షించి బిల్డర్‌ను హెచ్చరించారు. ఇక చేసేది లేని బిల్డర్ స్థానిక నాయకుడిని తిరిగి సంప్రదించగా 'పగలు పనిచేయకండి.. రాత్రులు పనిచేసుకోండి' అని చెప్పి మొహం చాటేశారు. దీంతో చేసేది లేక ఆయన ఇచ్చిన సలహాను పాటిస్తూ అదనంగా మరో ఫ్లోర్ నిర్మాణానికి చకచకా పని కానిస్తున్నాడు బిల్డర్. ఈ గుర్తింపులేని బిల్డర్ ఈ అక్రమ నిర్మాణాలతో పాటు మరో రెండుచోట్ల వంశీనగర్, మాధవధార వంటి ప్రాంతాల్లో ఇటువంటి నిర్మాణాలే చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు మేల్కొని పనులు ఆపించాలని స్థానికులు కోరుతున్నారు.

మా సమస్యలు పరిష్కరించరూ...

పోలీస్ శాఖ 22, ఇతర శాఖలకు చెందినవి 108 ఉన్నాయి. కార్యక్రమంలో ఎసిపి బాపూజీ, జివిఎంసి ఎడిసి వర్మ, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జివిఎంసికి 93 వినతులు

ఎంవిపి.కాలనీ : జివిఎంసి ప్రధాన కార్యాలయంలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు సోమవారం నిర్వహించారు. 93 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో ప్రధాన ఇంజినీరు పి.రవికృష్ణరాజు, అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, చీఫ్ మెడికల్ ఆఫీసరు డాక్టర్ నరేష్ కుమార్, చీఫ్ సిటీ ప్లానరు సురేష్ కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, కార్యదర్శి పి.నల్లనయ్య, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులు, దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఆయనతోపాటు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డిఆర్‌ఒ బి.దయానిధి ఉన్నారు. సోమవారంనాటి స్పందన కార్యక్రమానికి 532 అర్జీలు వచ్చాయి.

ఎస్‌పి కార్యాలయంలో...

ప్రజా సమస్యలను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులకు ఎస్‌పి మురళీకృష్ణ ఆదేశాలు జారీ చేశారు. పోలీసు స్పందన కార్యక్రమానికి సోమవారం 46 ఫిర్యాదులు వచ్చాయి. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాల ఫిర్యాదులు వీటిలో అధికంగా ఉన్నాయి. కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు బి.విజయ భాస్కర్, పి.సత్యనారాయణరావు, ఎస్‌ఐలు టి.దివ్య, కె.సావిత్రి పాల్గొన్నారు.

16న రవాణా రంగం బంద్

సవివరమైన చర్చ జరగాలన్నారు. కానీ మొత్తం ప్రతిపక్షాన్ని సభ నుంచి గెంటి వేసి ఈ చట్టాలను ఆమోదింపజేసుకున్నారని, ఇది దుర్మార్గమని అన్నారు. కొత్త చట్టంలోని సెక్షన్ 106 (2) డ్రైవర్ పాలిట ఉరితాడు అని తెలిపారు. సెక్షన్ 106 (1), (2)లోని శిక్షలు బ్రిటిష్ కాలం నాటి చట్టంలోని శిక్షల కంటే దారుణంగా ఉన్నాయన్నారు. వాస్తవానికి దేశంలో జరిగే రోడ్డు ప్రమాదాలలో 90 శాతం మానవేతర కారణాలతో జరుగుతున్నాయని ఇండియన్ న్యూస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) ఢిల్లీలో ప్రమాదాలపై అధ్యయనం చేస్తున్న ప్రముఖ ప్రొఫెసర్ గీతం తివారీ రుజువు చేశారని గుర్తు చేశారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షులు కెజెఎ.రావు (శివ), కార్యదర్శి అప్పలరాజు, ఆర్టీసీ హైర్ బస్ అన్ని డిపోల నాయకులు, లారీ ట్రాన్స్‌పోర్ట్ నాయకులు, మ్యాక్సీ క్యాబ్ నాయకులు, ఓలా, ఉబర్ కమిటీల నాయకులు, ఇతర మోటారు రంగాల నాయకులు పాల్గొన్నారు.



చెస్ టోర్నీ విజేతలతో అతిథులు

చెస్ టోర్నీ విజేత రిత్విక్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ వేదికగా నాలుగు రోజులు పాటు ఎంవిపి.కాలనీలోని ఎస్3 స్పోర్ట్స్ ప్రాంగణంలో శ్రీ చెస్ అకాడమీ ఆధ్వర్యాన జరిగిన చెస్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. మొదటి స్థానంలో విశాఖ చెందిన ఎం.వెంకటరిత్విక్, ద్వితీయ, తృతీయ స్థానాల్లో బీహార్‌కు చెందిన అశుతోష్ కుమార్, మోహిత్ కుమార్ సోనీలు నిలిచారు. ముఖ్య అతిథులుగా హాజరైన వార్గేవి ఇన్‌ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.సురేష్, సిపిఐ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ ఎం.రామచంద్రం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

రాజన్న ఆటోనగర్ పనులు ప్రారంభించాలని ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్మార్ట్ సిటీ విశాఖను స్క్రాప్ ఫ్రీ సిటీగా మార్చాలన్న లక్ష్యంతో ఆనందపురం మండలం కణమాం గ్రామంలో నిర్మించ తలపెట్టిన రాజన్న ఆటోనగర్ నిర్మాణ పనులకు వెంటనే శంకుస్థాపన చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద రాజన్న ఆటోనగర్ స్క్రాప్, ఆటోమొబైల్, స్పేర్ పార్ట్స్ కార్మికుల అసోసియేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు మాట్లాడుతూ నగర పరిధిలో ఉన్న 20 వేల మంది కార్మికులకు అన్నం పెడుతున్న ఈ రంగం పట్ల స్థానిక ఎమ్మెల్యే, మంత్రి, కలెక్టర్, ఎపిఐఐసి అధికారులు అదేపనిగా అబద్దాలు చెప్పి కార్మికులకు తీవ్ర ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. ఆటోనగర్ నిర్మాణానికి



ధర్నా చేస్తున్న స్క్రాప్, ఆటోమొబైల్, స్పేర్ పార్ట్స్ కార్మికులు

కావలసిన నిధులను ఇప్పటికే కేటాయించామని, నిర్మాణ పనుల బాధ్యత ఎపిఐఐసి వారికి అప్పగించామని కలెక్టర్ చెప్పారని, అయితే ఆయన చెప్పిన విషయం యదార్థం కాదని అన్నారు. ఈ నెల 21న స్క్రాప్ కార్మికులతో పాటు తాము కణమాం గ్రామానికి వెళ్లి చూడగా అక్కడ ఎటువంటి పనులూ చేపట్టలేదని తెలిపారు. అక్కడ ప్లాట్స్ వేసినట్లు ఎటువంటి ఆధారాలూ లేవన్నారు. 157.77 ఎకరాలు ఉన్న ఈ స్థలాన్ని కాజేయాలని వైసిపి నాయకులు, ముఖ్యంగా భీమిలి ఎమ్మెల్యే అవంతి శ్రీనివాసరావు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఆయన అటువంటి ప్రయత్నాలను విరమించాలన్నారు. వైసిపి నాయకులు, ప్రభుత్వ అధికారులు ఆడుతున్న నాటకాలను ఆపి వెంటనే ఆటోనగర్ నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. లేనిపక్షంలో మంత్రులు, ఎమ్మెల్యేల గృహాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. దక్షిణ ఎమ్మెల్యే గణేష్ కుమార్‌ను నియోజకవర్గంలో తిరగకుండా అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు, కె.గణేష్, కయ్యూమ్, సమీర్, రబ్బాని, షేక్ రియాజ్, సాహిద్ ఖాన్, ఎస్.కె.బాబ్జీ, జిలాని తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లను వదిలేస్తేనే అభివృద్ధి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నూతన సామాజిక క్రమంవైపు వెళ్లాలంటే చెడు అలవాట్లను వదిలేయాలని, మనతోపాటు మిగిలిన వారిని మంచి కార్యక్రమాల్లో భాగస్వామిలను చేయాలని, అప్పుడే ప్రగతి సాధ్యమని సిఎంఎఫ్ఆర్ఐ ఇందిర అన్నారు. ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో తలపెట్టిన వైజాగ్ సింపోజియం - 2024 కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. తొలిరోజు అభివృద్ధి పురోగతి-నూతన సామాజిక క్రమం అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న బ్యాంక్ ఆఫ్ ఇండియా డిజిఎం జ్యోతీశ్వరరావు, ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ షేక్ లా మహమ్మద్ ముందుగా మీరే ఆధారం కార్యక్రమాన్ని ప్రారంభించి పుస్తకాన్ని ఆవిష్కరించారు. విశాఖ నగరంలో ఉన్న నీటి గుంటలు చెరువుల వివరాలు ఈ పుస్తకంలో పొందుపరచడం పట్ల వారు హర్షం వెలిబుచ్చారు. ధాన్ ఫౌండేషన్ ప్రోగ్రాం లీడర్లు గురునాథ్, జానకిరామ్, మదన్ కుమార్ మాట్లాడుతూ



జ్యోతి ప్రజ్వలన చేసి సింపోజియంను ప్రారంభిస్తున్న అతిథులు

ఫౌండేషన్ 25 సంవత్సరాలుగా పేదరిక నిర్మూలన కోసం పనిచేస్తోందన్నారు. ఇప్పటికే 33 వేల మందిని భాగస్వాములను చేసినట్టు తెలిపారు. ఆరోగ్య కార్యక్రమాల్లో భాగంగా మల్కాపురం సుహం సమాఖ్య హాస్పటల్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. దీనికి రెడ్డీన్ట్ సహకారం అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇసుక తోట బ్రాంచ్ మేనేజర్ ఉదయ్ భాస్కరరావు, ఆడిటర్ చలపతిరావు, జెఎస్ఐ నుంచి శ్రీనివాసరావు, సెయింట్ జోసెఫ్ కాలేజీ నుంచి గాయత్రి, వి.భాస్కర్, సుహం సిబ్బంది, డాక్టర్లు, నాలుగు సమైక్యల నుంచి బోర్డు లీడర్లు పాల్గొన్నారు.

14న జెడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఫిబ్రవరి 14న నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సిఇఒ ఎం.పోలినాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. సర్వసభ్య సమావేశానికి సభ్యులు, అహ్వానితులు హాజరు కావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అన్ని శాఖల జిల్లా అధికారులు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రగతి నివేదికలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

నేడు మాంసం దుకాణాలకు సెలవు

ఎంవిపి.కాలనీ : గాంధీ వర్థంతి సందర్భంగా మంగళవారం మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ పరిధిలో మాంసం, చేపలు విక్రయించకూడదని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిపే దుకాణాలపై జివిఎంసి పశువైద్య విభాగపు సిబ్బంది అపరాధ రుసుము విధిస్తారని పేర్కొన్నారు. వ్యాపార లైసెన్సులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

టిడిపి, వైసిపి హయాంలో తీవ్ర అన్యాయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : టిడిపి, వైసిపిల హయాంలో ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ నాయకులు, ఎపి టెక్నాలజీ విభాగం మాజీ చైర్మన్ కొయ్య ప్రసాద్ రెడ్డి అన్నారు. దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సి ఉందన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల కురుక్షేత్రం మొదలయిందన్నారు. పదేళ్లుగా టిడిపి, వైసిపి పాలనలో ప్రజలకు అన్యాయం జరిగిందన్నారు. విభజన హామీలు సాధించలేని పార్టీలుగా అవి మిగిలిపోయాయన్నారు. అన్ని సహజ వనరులూ పుష్కలంగా ఉన్న రాష్ట్రానికి ఆ రెండు పార్టీల వల్ల లక్షల కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షులు గొంప గోవిందరాజులు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాకినాడ చిన్నబాబు, నాయకులు తలారి సురేష్, హాసిని వర్మ, మహ్మద్ హర్షద్ బాషా, నమ్మి రామారావు, దేవ పాల్గొన్నారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు సాంకేతిక అధికారిగా శర్మ



ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1 వరకూ చెన్నయ్‌లో జరగనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు సాంకేతిక అధికారిగా విశాఖపట్నం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న డాక్టర్ డివిఎస్‌వై.శర్మ నామినేట్ అయ్యారు. ఆయన ఇప్పటికే ఇంటర్నేషనల్ టాబ్లెటెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి బ్లూబ్యాడ్జ్ ఇంటర్నేషనల్ అంపైర్‌గా గుర్తింపు పొందారు. అతని ఎంపికపై లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ శరద ప్రసాద్ దాస్, మేనేజర్ పర్సనల్ భగవాన్ ప్రసాద్, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ యూనియన్ ప్రెసిడెంట్ కామేశ్వరి, జనరల్ సెక్రటరీ వరప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. అభినందనలు తెలియజేశారు. శర్మను ఆంధ్రప్రదేశ్ టాబ్లెటెన్నిస్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

సంతోష్ కుమార్‌కు సత్కారం



సంతోష్‌కుమార్‌ను సత్కరిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని

ప్రజాశక్తి- వేపగుంట : కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖలో చీఫ్ కంట్రోలర్ ఆఫ్ ఎకౌంట్స్ వ్యవహారాలు నిర్వహిస్తున్న సంతోష్ కుమార్‌ను జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఘనంగా సత్కరించారు. ఆదివారం తన నివాసానికి అల్పాహార విందుకు సంతోష్‌కుమార్‌ను ఆహ్వానించిన శ్రీధర్, ఆయనకు ఘనంగా స్వాగతించి, అల్పాహార విందు తర్వాత సత్కరించారు. దేశంలో పరిశుభ్రమైన నగరాల్లో విశాఖకు నాలుగోస్థానం రావడంపై ఆయన శ్రీధర్‌ను అభినందించారు.

యాదవ సంఘం గ్రామ కమిటీ

ప్రజాశక్తి -భీమునిపట్నం :మండలంలోని టి నగరపాలెం యాదవ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షునిగా మాజీ సర్పంచ్ పల్లా వెంకటరావు ఎన్నికయ్యారు. సోమవారం గ్రామంలో నిర్వహించిన యాదవ సంఘ సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. యాదవ సంఘం ప్రధాన కార్యదర్శిగా పూసర్ల రామారావు, ఉపాధ్యక్షులుగా కోరాడ రాము, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దువ్వి సురేష్, సహాయ కార్యదర్శిగా కర్రి వెంకటేష్‌లను ఎన్నుకున్నారు.

మంజూరైన పింఛను ఇప్పించరూ..!

ప్రజాశక్తి -పద్మనాభం : నిబంధనల మేరకు అన్ని విధాలా అర్హుడినైన తనకు ప్రభుత్వం తరపున వృద్ధాప్య పింఛను మంజూరైనా, పంపిణీ చేయకుండా అధికారులు నిలుపుదల చేశారని. మండలంలోని రేవిడి గ్రామానికి చెందిన ఎం.సూర్య బాపిరాజు సోమవారం ఎంపిడిఒ ప్రభాకర్‌కు ఫిర్యాదు చేశారు. ఇటీవల కొత్తగా మంజూరైన వృద్ధాప్య పింఛన్ల జాబితాలో తన పేరు ఉందని, అయితే అధికారులు లేనిపోని అభియోగాలకు తనకు పింఛను ఇవ్వకుండా అన్యాయం చేశారన్నారు. అన్ని విధాలా అర్హుడినైనతనకు పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని ఎంపిడిఒను వేడుకున్నాడు.

'పది' పరీక్షల సన్నద్ధతపై సూచనలు

ప్రజాశక్తి- పద్మనాభం :మండలంలోని విజయానంద నవపురం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల సన్నద్ధత, పరీక్షలు రాయడంపై సోమవారం అవగాహన కల్పించారు. డైట్ సీనియర్ లెక్చరర్ ఎస్.త్రినాథరావు పాల్గొని, ఎల్‌ఐపి నిర్వహణ, విద్యార్థుల్లో భాషానైపుణ్యాల మెరుగుదలకు చేపట్టాల్సిన చర్యలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. టీచింగ్ పీరియడ్, ప్రాక్టీస్ పీరియడ్‌లోని అంశాలను వివరిస్తూ, పాఠాలను బోధించాలని సూచించారు. హెచ్‌ఎం ఎం.సరిత, రాజారాజేశ్వరి, విజయరావు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

ప్రజాశక్తి- వేపగుంట : నరవలోని విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీలోని విద్యార్థులకు యూత్ సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. సోమవారం జెసిఐ వైజాగ్ చాప్టర్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించిన జెసిఐ ప్రెసిడెంట్ వి.చైతన్య మాట్లాడుతూ, విద్యార్థులు నాయకత్వ లక్షణాలను, సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ వి.శ్రీధర్ పట్నాయక్, వైస్ ప్రిన్సిపల్ జీవన్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చిటిమిరెడ్డి వీరునాయుడు,ఉమెన్స్ గ్రీవెన్స్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.దయానా పాల్గొన్నారు.

'స్పందన'కు ఒకే అర్జీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక జివిఎంసి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఒకే అర్జీ వచ్చిందనిజోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము తెలిపారు.దీన్ని తదుపరి చర్యలకు సంబంధిత విభాగం అధికారికి పంపించినట్లు జెడిసి రాము తెలిపారు

సంక్షేమ పథకాల అమలుపై ఆరా

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 53వ వార్డు లక్ష్మీనగర్ సచివాలయం సాయినగర్, మసీదు ప్రాంతాలో విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె.రాజు, స్థానిక కార్పొరేటర్ బర్కత్‌అలీతో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించాలన్న తపనతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజాసమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడం, అర్హులకు సంక్షేమ లబ్ధిని చేకూర్చడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కృష్ణారావు, డైరెక్టర్లు బాకీ శ్యాంకుమార్ రెడ్డి, రాయుడు శ్రీను, జెసిఎస్ ఇన్‌ఛార్జిలు అమర్ రెడ్డి, వసంతల అప్పారావు, 53వవార్డు నాయకులు హనుమంతు, షేక్ బాబ్జి, రామారావు, సదరం జ్ఞానేష్, పాత్రుడు, యూనస్, సంపత్, భార్గవ్, క్రిష్ణ కిరణ్, జ్యోత్స్న, అనిల్, శ్రీదేవి, అలీ, ఆదిలక్ష్మి, ప్రసన్న, లక్ష్మి, రవణమ్మ, గిరీష్, కనకరాజు, సీనియర్ నాయకులు బోగవల్లి గోవింద్, ఎం సునీల్, సమ్మెట్ల వెంకటేష్, జివిఎంసి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గడపగడపలో సంక్షేమ పథకాల బ్రోచర్లు ఇస్తున్న కెకె.రాజు

భీమిలి నుంచే వైసిపి పతనం ఆరంభం

పరాకాష్టకు చేరిన వైసిపి వికృత చేష్టలు : జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి సందీప్



పవన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జనసేన నేతలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : రానున్న ఎన్నికల్లో వైసిపి పతనం భీమిలి నుంచే ప్రారంభం కానుందని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ పంచకర్ల సందీప్ అన్నారు. ఇటీవల సంగివలసలో సిద్ధం పేరుతో నిర్వహించిన సభలో జనసేన అధినేత పవన్ కల్యాణ్, ప్రధాన ప్రతిపక్ష నేత చంద్రబాబు ఫొటోలకు బాక్సింగ్ పంచింగ్‌లతో కూడిన కటౌట్లు ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. దీనికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వైసిపి చర్యలను నిరసిస్తూ, స్థానికచిన్న బజారు జంక్షన్ వద్ద పవన్ కల్యాణ్ ఫొటోకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ, పవన్‌కల్యాణ్ ఫోటోపై కాళ్లు, చేతులతో దాడి చేస్తూ పైశాచికానందాన్ని పొందడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. విపక్ష నేతలపై భౌతిక దాడులకు తమ పార్టీ శ్రేణులను పురిగొలిపేలా వైసిపి అధినేత చర్యలు ఉన్నాయన్నారు. వైసిపి రాజకీయపార్టీయా? లేకుంటే ఉగ్రవాదసంస్థ అనే అనుమానం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బివి కృష్ణయ్య, శేఖర శ్రీనుబాబు, నాగోతి నరసింహ నాయుడు, అక్కరమాని దివాకర్, పరిమి భువనేశ్వరి పాల్గొన్నారు

మద్యంపై యుద్ధానికి సిద్ధం కండి

ప్రజాశక్తి- పెందుర్తి : మద్యంపై యుద్ధానికి సిద్ధం కావాలని ఎపి మహిళ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల మహిళాలోకానికి పిలుపునిచ్చారు. సంపూర్ణమద్యనిషేధంపై ప్రభుత్వం ఇచ్చిన హామీని తుంగలో తొక్కడాన్ని నిరసిస్తూ ఈనెల 31న చేపట్టే చలో విజయవాడ ఆందోళనను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం పెందుర్తి రైతు బజార్ వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సిఎం జగన్మోహనరెడ్డి నవరత్న పథకాలలో మద్యనిషేధాన్ని ప్రధానాంశంగా చేర్చి, ఇపుడు సొంత తయారీ బ్రాండ్లతో నాసిరకం మద్యాన్ని విక్రయిస్తూ, 65 వేల కోట్లను వెనకేసుకున్నారని ఆరోపించారు. మద్యంపై యుద్ధంలో ప్రజలు, ముఖ్యంగా మహిళలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎపి మహిళ సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎంఎ బేగం, పెందుర్తి ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.అన్నపూర్ణ, ఎన్ అరుణ, కె.రజిని, అనురాధ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళా సమాఖ్య ప్రతినిధులు

మానవ హక్కుల పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి -గాజువాక : మానవ హక్కుల మిషన్ జిల్లా ఉపాధ్యక్షులుగా వైద్యరత్న డాక్టర్ దేవరపల్లి శ్రీనివాసరావు ఎంపికయ్యారు. జిల్లా మానవ హక్కుల మిషన్ అధ్యక్షులు ఒ.వెంకట విశ్వనాథ్ జిల్లా కార్యాలయంలో సోమవారం నియామక పత్రాలు అందజేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఆనందపురం : మండలంలోని లొడగలవానిపాలెం అభయాంజనేయస్వామి 17వ వార్షికోత్సవాన్ని మాజీ జెడ్‌పిటిసి బమ్మిడి ఉమ, మాజీ సర్పంచ్ బమ్మిడి సూర్యనారాయణ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి బమ్మిడి తారక్, పంచకర్ల సందీప్ పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపం లేకుండా చర్యలు

ప్రజాశక్తి -ఆనందపురం :అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు పౌష్టికాహారం పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తగు చర్యలు చేపడుతోందని కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. సోమవారం మండలంలోని గిడిజాల అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి, మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ పిల్లల్లో పౌష్టికాహార లోపం లేకుండా ఆరోగ్యవంతమైన బాలల సమాజ స్థాపనకు కమిషన్ నిర్విరామ కృషి చేస్తోందన్నారు. చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.శ్రీదేవి, ఎంఇఒ పద్మావతి, అంగన్వాడీ సూపర్‌వైజర్ పతివాడ రత్నం పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-ఉక్కునగరం : కుటుంబ కలహాలతో ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన కూర్మన్నపాలెం, అంబేద్కర్ కాలనీలో చోటుచేసుకుంది. మతురాలి తండ్రి పువ్వుల శంకరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలివి. ఫార్మా సిటీలో పనిచేస్తున్న పాండురంగారావుకు ప్రమీల (31)తో 2012లో వివాహం జరిగింది. ఈనెల 29న అర్ధరాత్రి ఒకటిన్నర సమయంలో ప్రమీల ఉరివేసుకుందని అల్లుడు తమకు ఫోన్ చేసి తెలిపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పార్వతీపురం నుంచి కెజిహెచ్ వచ్చి, తమ కుమార్తె మృతదేహాన్ని చూసి ప్రమీల తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. తన కూతురు మరణానికి అల్లుడే కారణమని, తనకు న్యాయం చేయాలని శంకరరావు ఫిర్యాదులో కోరాడు.

18 మద్యం బాటిళ్ల స్వాధీనం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని భీమిలి క్రాస్‌రోడ్డు చెక్‌పోస్ట్ వద్ద సోమవారం మధ్యాహ్నం స్కూటీపై అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఇబి ఎంఎస్.చలం ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా బొడ్డపాలెం గ్రామానికి చెందిన తోనంగి పాపయ్య ఆనందపురంలోని వైన్‌షాప్‌లో 18 విస్కీ బాటిళ్లను కొనుగోలు చేసి, బొడ్డుపాలెంలోని పాన్‌షాప్‌కు తీసుకెళుతుండగా పట్టుకున్నామని, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగాల పేరిట మోసం

- బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు

ప్రజాశక్తి -మధురవాడ: ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో మోసానికి పాల్పడిన వ్యక్తులపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పిఎం.పాలెం సిఐ వై.రామకృష్ణ తెలిపారు. వివరాలివి.

ఎండాడ బీసీ కాలనీకి చెందిన గంటలకగండేపల్లి ఆంథోని రాజేష్ ఆంధ్రా యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేశాడు. ప్రభుత్వ ఉద్యోగాల పోటీపరీక్షలకు సన్నద్ధమౌతున్న అతనికి విజయవాడకు చెందిన షేక్ షరీఫ్ ఫోనులో పరిచయమై ప్రభుత్వ ఉద్యోగమిస్తానని నమ్మబలికాడు. రైల్వేలో ఉద్యోగానికి రూ.ఆరు లక్షలు, నీటిపారుదలశాఖలో ఉద్యోగానికి రూ.5.50లక్షలు ఇవ్వాలని షరీఫ్, అతని భార్య సల్మా షేక్ నమ్మబలడంతో రాజేష్ కొంత నగదు ముట్టచెప్పాడు. తర్వాత తన సోదరుడు కిరణ్ తోపాటు స్నేహితులు మురళీకృష్ణ, జగదీష్, శ్రీనివాస్‌లకు విషయం చెప్పడంతో వారుకూడా షరీఫ్ మాయలో పడి ఉద్యోగం కోసమని ముడుపులు ముట్టచెప్పారు. ఇలా వారంతా ఫోన్‌పే, ఇంకా బ్యాంకు ఖాతాల్లో రూ.9.15లక్షలను షరీఫ్ షేక్, సల్మా షేక్, షేక్ అహ్మద్ ఖాతాలకు జమ చేశారు. తర్వాత కిరణ్, మురళీకృష్ణ, జగదీష్, శ్రీనివాస్‌లకు నోట్ ఫైల్ ఇచ్చి ప్రాసీడింగ్ కాపీని మురళీకృష్ణకు అందించారు. కానీ ఎప్పటికీ ఉద్యోగం రాకపోవడంతో నిలదీసి ప్రశ్నించగా, ఏదో కారణం చెప్పి తప్పించుకు తిరగడంతో తాము మోసపోయామని గుర్తించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఆనందపురం మండలం, లొడగలవానిపాలెంలో తమ అనుభవంలో ఉన్న 15 ఎకరాల భూమిలో గ్రావెల్‌ను రేయింబవళ్ల తేడా లేకుండా అక్రమంగా తరలించుకుపోతున్నారని బాధిత రైతులు కె శ్రీను, ఎం నారాయణ, డి పైడిరాజు, తదితరులు సోమవారం ఆర్‌డిఒకు ఫిర్యాదు చేశారు. ఐదు జెసిబిలతో గ్రావెల్‌ను తవ్వి, లారీల్లో యథేచ్ఛగా తరలించుకుపోతున్నారని, తమ స్వాధీనంలో ఉన్న భూమి తమకు దక్కనీయకుండా చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక కమిటీలో కదిరి

ప్రజాశక్తి- భీమునిపట్నం : త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల ప్రణాళిక రూపకల్పన కమిటీలో భీమిలికి చెందిన కాంగ్రెస్ పార్టీ మత్స్యకార విభాగం రాష్ట్ర చైర్మన్ కదిరి జగన్నాథానికి ఆహ్వానం అందింది. కమిటీలో తన పేరును పరిగణించడంపై హర్షం వ్యక్తం చేస్తూ, ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డికి, పిసిసి మాజీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, సీనియర్ నేత పల్లంరాజులకు కృతజ్ఞతలు తెలిపారు

టెన్నిస్ విజేతలకు బహుమతులు



బహుమతులు అందుకుంటున్న విజేతలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : టెన్నిస్ క్రీడాకారులు రవీంద్రరాజు, తన తండ్రి డిజె రాజు జ్ఞాపకార్థం ఈ నెల 27,28 తేదీల్లో పివిజి రాజు మెమోరియల్ గోల్డెన్ జూబ్లీ టెన్నిస్ క్లబ్ ఆధ్వర్యాన నిర్వహించిన టెన్నిస్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ట్రోఫీ విజేతలు మైలపల్లి షణ్ముఖరావు, జి సతీష్ లకు రూ.8వేలు, రన్నర్స్ విజ్జపు వెంకటేష్, టి భీమారావులకు రూ.నాలుగు వేలు, మూడో స్థానంలో నిలిచిన పివెంకటేష్, ఎం మహేశ్వరరావులకు రూ 2 వేలు నగదు బహుమతులు అందజేశారు. టెన్నిస్ క్లబ్ సభ్యులు సీనియర్ న్యాయవాది పి సుందర్‌సింగ్ అధ్యక్షతన జరిగిన సభలో క్లబ్ సభ్యులు, సిటిజన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు

పర్యావరణ పరిరక్షణ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- సీతమ్మధార : పర్యావరణ పరిరక్షణ దినోత్సవాల వివరాలతో కేలండర్ ముద్రించడం అభినందనీయమని ఎయు ఎన్విరాన్మెంటల్ సైన్స్ ప్రొఫెసర్ ఇ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గ్రీన్ క్లైమేట్ స్వచ్ఛందసంస్థ ముద్రించిన కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, ప్రపంచమంతా కాలుష్యకారకమౌతున్న నేటి రోజుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహనకు, దీనికి సంబంధించి ఐక్యరాజ్యసమితి పేర్కొన్న పర్యావరణ పరిరక్షణ దినోత్సవాలు, భారత ప్రభుత్వ జాతీయ పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య, వన్యప్రాణుల దినోత్సవాల వివరాలతో ముద్రించిన కేలండర్ అందరికీ ఉపయుక్తమౌతుందన్నారు.

గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్యవర్మ మాట్లాడుతూ. కేలండర్ ఆధారంగా ప్రతి విద్యాసంస్థలోనూ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాలు నిర్వహించాలన్నారు. పర్యావరణ ప్రేమికులంతా దీనికి ప్రోత్సాహమివ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఫా ట్రస్ట్ ప్రతినిధి వి. నర్సింగ్, సెంట్రల్ యూనివర్సిటీ బోటనీ విద్యార్థి జ్యోత్స్న, ఆంధ్ర యూనివర్సిటీ సోషల్ వర్క్ విద్యార్థులు బి భరద్వాజ్ కుమార్, ఎ.వెంకటరమణ, సిహెచ్ రాజేశ్వరి, ఎ.సూర్యనారాయణ, బి యామిని, నారాయణరావు, నాని, ధర్మ, గ్రీన్ క్లైమేట్ సంస్థ కార్యదర్శి జెవి రత్నం, వాలంటీర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

హ్యూమన్ జెనిటిక్స్‌పై సెమినార్



డాక్టర్ సునీల్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎంవిఆర్ యాజమాన్యం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఎంవిఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం హ్యూమన్ జెనిటిక్స్‌పై సెమినార్ నిర్వహించారు. కళాశాల పూర్వ విద్యార్థి, ఢిల్లీ లోకేనాయక్ ఆసుపత్రి సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సునీల్‌కుమార్ పాల్గొని, స్క్రీనింగ్, న్యూ బార్ క్లీనింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బి రామారావు మాట్లాడుతూ ఈ రకమైన సెమినార్‌లు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. డాక్టర్ సునీల్‌కుమార్ తమ కాలేజీ పూర్వ విద్యార్థి కావడం గర్వంగా ఉందన్నారు.. యోగకరమైన తెలిపారు. అనంతరం డాక్టర్ సునీల్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్‌వి.కృష్ణ, డాక్టర్ వై.ఈశ్వరరాజు, మైక్రోబయాలజీ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కిమ్స్ ఐకాన్‌లో అరుదైన ఆపరేషన్

- ప్రీమెచ్యూర్ బేబీకి సంక్లిష్టమైన ఓపెన్ హార్ట్ సర్జరీ
- విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ అనిల్‌కుమార్ బృందం



చిన్నారి, తల్లిదండ్రులతో వైద్యబృందం

ప్రజాశక్తి- గాజువాక : నగర చరిత్రలోనే తొలిసారిగా కేవలం 1.3 కిలోల బరువున్న, నెలలు నిండక ముందే పుట్టిన ఓ చిన్నారికి అత్యంత సంక్లిష్టమైన గుండె శస్త్రచికిత్సను (ఓపెన్ హార్ట్ సర్జరీ) విజయవంతంగా చేశారు. 32 వారాల గర్భంతోనే పుట్టిన కవలల్లో బాబు ఆరోగ్యంగానే ఉన్నా, పాపకు మాత్రం పుట్టిన కాసేపటికే ఊపిరి అందక బాగా ఇబ్బందికి గురైంది. దీంతో నగరంలోని లోటస్ పిల్లల ఆస్పత్రిలో చీఫ్ నియోనాటాలజిస్టు డాక్టర్ గణేశ్ శంకు నేతృత్వంలోని నియోనాటాలజీ యూనిట్‌లో చేర్చి సంరక్షించారు. అప్పటికి పాప బరువు 1.2 కిలోలే. అనంతరం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి చెందిన కడల్స్ విభాగంలోని పీడియాట్రిక్ కార్డియాలజిస్టు డాక్టర్ శాంతిప్రియ శిశువును పరీక్షించారు. శిశువుకు పుట్టుకతోనే వచ్చే గుండె సమస్య ఉందని, దీన్ని వైద్య పరిభాషలో ఇన్‌ఫ్రా డయాఫ్రాగ్మాటిక్ టోటల్ ఎనాలమస్ పల్మనరీ వీనస్ కనెక్షన్ (టిఎపివిసి) అంటారని గుర్తించారు. ఊపిరితిత్తుల నుంచి శుద్ధి చేసిన రక్తాన్ని గుండెకు తీసుకెళ్లాల్సిన రక్తనాళాలు, అసాధారణంగా గుండె దిగువన కాలేయంలోకి వెళ్లిపోతుండడాన్ని గమనించారు.

పాపకు 34 వారాల వయసు వచ్చేవరకు ఆగి, కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి కడల్స్ యూనిట్‌లో డాక్టర్ అనిల్‌కుమార్ ధర్మపురం నేతృత్వంలోని నిపుణుల బృందం ఓపెన్ హార్ట్ సర్జరీ చేసింది. కాలేయానికి వెళ్తున్న రక్తనాళాలన్నింటినీ జాగ్రత్తగా తీసి, వాటిని మళ్లీ సాధారణ పద్ధతిలో గుండెలోని ఎడమవైపుకు మార్చారు. ఈ శస్త్రచికిత్సకు ఏకంగా 8 గంటలు పట్టింది. పీడియాట్రిక్ కార్డియాక్ ఎనస్థీషియాలజిస్టు డాక్టర్ ఆర్.నాగరాజన్ మత్తుమందు అందించారు. శస్త్రచికిత్స అనంతరం నియోనాటల్ ఐసీయూలో డాక్టర్ నిఖిల్ తెన్నేటి నేతృత్వంలోని వైద్యబృందం పాపను కంటికి రెప్పలా కాపాడడంతో పాప బాగా కోలుకుంది. పాపకు సాధారణంగానే పాలు ఇవ్వడం మొదలుపెట్టి, పూర్తి ఆరోగ్యంతో డిశ్చార్జి చేశారు.

ప్రపంచవ్యాప్తంగా తక్కువ బరువుతో, నెలలు నిండకముందే పుట్టిన పిల్లలకు సంక్లిష్టమైన గుండె శస్త్రచికిత్సలు చేసేటప్పుడు మరణాల రేటు చాలా ఎక్కువగా ఉందని, . కానీ, తెలుగు రాష్ట్రాల్లోనే ఇంత తక్కువ బరువున్న నెలలు నిండని పాపకు విజయవంతంగా శస్త్రచికిత్స చేసి, ప్రాణాలు కాపాడిన అతి తక్కువ కేసుల్లో ఇదొకటని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఆపరేషన్ విజయవంతం కావడంపై పాప, తల్లిదండ్రులు, కుటుంబీకులు హర్షం వ్యక్తం చేసి, వైద్యబృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



చెక్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి- భీమునిపట్నం : మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండలంలోని మజ్జి వలసలో ఆసరా పథకం కింద మండలంలోని 815 పొదుపు సంఘాలకు చెందిన 8,500 మంది సభ్యులకు రుణమాఫీ కింద రూ.6.71కోట్ల ఆర్థికసాయం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి దంతులూరి వెంకటశివ సూర్యనారాయణ రాజు, జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, వైస్ ఎంపిపి బోని బంగారునాయుడు, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ డి పెదబాబు, ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, సర్పంచ్ తుపాకుల ఆదిలక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ శోభారాణి, ఎపి ఎం, బి రంగారావు, ఎసి సత్యనారాయుడు పాల్గొన్నారు

పెందుర్తి : పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న సిఎం జగన్, వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు అన్నారు. సోమవారం పెందుర్తి జూనియర్ కళాశాలలో ఆసరా లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్న సిఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి మధుపాడు నాగమణి, వ్యవసాయ మార్కెటింగ్ చైర్మన్ దేవీ సాంబ పాల్గొన్నారు



నమూనా చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- మాధవధార : స్థానిక మురళీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1997-98 బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక మాధవధార తోటలో నిర్వహించారు.పాతికేళ్ల తర్వాత కలుసుకున్న పూర్వమిత్రులంతా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని, పాతజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రోజంతా విందు వినోదాలతో సందడి చేశారు. ప్రతిఒక్కరూ చిన్నపిల్లల్లా మారిపోయి, ఆనందంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థి నంబాళ్ల ఈశ్వరరావు మాట్లాడుతూ, సహచర మిత్రుల్లో ఎవరికైనా ఆరోగ్యం, ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తితే పూర్వవిద్యార్థులంతా సమిష్టిగా అండగా నిలిచి, ఆర్థికసాయం చేయాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని నిర్ణయించామన్నారు.

కార్మికనేత వెంకటేశ్వర్లు

- స్టీల్‌ప్లాంట్‌లో 36 ఏళ్లపాటు నిర్విరామ సేవలు
- రేపు ఉద్యోగ విరమణ : పలువురి శుభాకాంక్షలు

ప్రజాశక్తి -ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో జూనియర్ ట్రైనీగా జాయినై, ఈనెల 31న బుధవారం జనరల్ ఫోర్‌మెన్‌గా ఉద్యోగ విరమణ చేయనున్న ఉప్పుటూరు వెంకటేశ్వర్లును కార్మికనేతలు, తోటి కార్మికులు అభినందనలు తెలిపారు. ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు చెబుతున్నారు. 1987 జూలై 14, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో జూనియర్ ట్రైనీగా చేరిన ఉప్పుటూరు వెంకటేశ్వర్లు కార్మికుడిగా రోల్‌షాప్ అండ్ రిపేర్ షాప్‌లో విధుల్లో చేరారు. 36 సంవత్సరాల 7నెలల సుదీర్ఘ సర్వీసును విజయవంతంగా పూర్తి చేసి, ఉద్యోగ విరమణ చేయనున్నారు.

.ఒంగోలు జిల్లాకు చెందిన ఉప్పుటూరి వెంకటసుబ్బయ్య, శాయమ్మల మొదటి సంతానంగా వెంకటేశ్వర్లు 1964 జనవరిలో జన్మించారు. ప్రాథమికవిద్యను కొప్పోలు గ్రామంలోను , ఉన్నత విద్య ఒంగోలులోను , సాంకేతిక విద్య ఒంగోలు ప్రభుత్వ ఐటిఐలో పూర్తిచేసి, అనంతరం డిప్లమో పూర్తి చేశారు.

హైదరాబాద్ రామచంద్రాపురంలోని డెన్సన్ హైడ్రాలిక్స్ ఇండియా లిమిటెడ్‌లో 1981లో ఉద్యోగంలో చేరి అక్కడ సిఐటియులో కీలకమైన పాత్రను పోషించారు. యూనియన్ కార్యదర్శిగా యాజమాన్యం దౌర్జన్యాలను ప్రశ్నించడంతో 1987 మార్చిలో సస్పెన్షన్‌కు గురయ్యారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్లో 1987 జూలై 14న జూనియర్ ట్రైనీగా చేరి, ఆర్ఎస్అండ్ఆర్ఎస్ విభాగంలో కార్మికునిగా పర్మినెంటై, అంచెలంచెలుగా జనరల్ ఫోర్‌మెన్ స్థాయికి ఎదిగారు. జూనియర్ ఆఫీసర్‌గా యాజమాన్యం ప్రమోషన్ ఇచ్చినప్పటికీ, కార్మికుల హక్కులకు పోరాడాలనే తపనతో ప్రమోషన్‌ను సున్నితంగా తిరస్కరించారు. చిన్నతనం నుంచే కమ్యూనిస్టు భావాలున్న వ్యక్తి కావడంతో సిఐటియులో చేరి కార్మికుల శ్రేయస్సుకు, కంపెనీ అభివృద్ధికి పాటుపడ్డారు. కార్మికుల సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు.



ఉప్పుటూరు వెంకటేశ్వర్లు, శేషమ్మ దంపతులు

సిఐటియు యూనియన్‌లో కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడుగా, సెక్రటేరియేట్ సభ్యుడుగా, స్టీల్ ప్లాంట్ క్యాంటీన్‌లకు యాజమాన్యం నియమించిన కమిటీలో సభ్యులుగా సిఐటియు లో అనేక కీలక బాధ్యతలు నిర్వహించారు. 1993 డిఎ న్యూట్రలైజేషన్ కోసం జరిగిన పోరాటంలో మొట్టమొదటిసారిగా అరెస్టయిన వెంకటేశ్వర్లు, తర్వాత 1995లో వేతన ఒప్పంద సాధన కోసం పోరాటంలో పోలీసు కేసులు ఎదుర్కొన్నారు. పలుమార్లు అరెస్టయ్యారు. 2000లో ప్లాంట్ పరిరక్షణ ఉద్యమంలోనూ, బేసిక్‌పై 20 శాతం హెచ్ఆర్ఎ కోసం చేసిన పోరాటం వరకు అతనిపై ఎనిమిది కేసులునమోదయ్యాయి. కరోనా సమయంలోనూ యూనియన్ ఆఫీస్ వద్ద రెడ్‌క్రాస్ సహాయంతో అంబులెన్స్ ద్వారా అనేక మందిని ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. రక్తదాన శిబిరాల్లో పాల్గొని తాను స్వయంగా పది సార్లుకు పైగా రక్తదానం చేయడంతోపాటు కుటుంబసభ్యులను, స్నేహితులను రక్తదానానికి ప్రోత్సాహించారు.. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగంలో చేరిన నాటి నుంచి ఉద్యోగ విరమణ వరకు సిఐటియులో పలు బాధ్యతలు నిర్వర్తించారు. వెంకటేశ్వర్లుకు భార్య శేషమ్మ ఇద్దరు పిల్లలు. అబ్బాయి రాజశేఖర్ చెన్నైలో రేనాల్ట్ నిస్సాన్‌లో ఉద్యోగం, కోడలు సాయి మృదుల కూడా చెన్నైలోని ఎసెంచర్‌లో ఉద్యోగం, కుమార్తె రమ్య,అల్లుడు జగదీష్ బెల్జియంలో ఉద్యోగం. మనుమరాలు హన్విక, మనుమడు నిహాన్స్ ఉన్నారు.

తాడి ల్యాండ్ ఫిల్‌పై

ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలి

జిల్లా కలెక్టర్‌కు సిపిఎం వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేత లోకనాథం తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఎన్‌జిటిలో రాంకీ కాలుష్యంపై కేసు నెంబర్ 141 ఆఫ్ 2023 (ఎస్‌జెడ్) వుండగా తాడిలో ల్యాండ్ ఫిల్ ఏర్పాటుకు జనవరి 30న ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించడం చట్ట విరుద్ధమైనదని, తక్షణమే దీనిని రద్దు చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ పరవాడ మండలం, తాడి సర్వేనెంబర్ 116 పార్ట్‌లో జెఎన్ ఫార్మా సిటీ డెవలపర్ ర్యాంకీ మరో 50 ఎకరాల్లో ప్రమాదకర వ్యర్థాల శుద్ధి నిల్వ (ల్యాండ్ ఫిల్) ఏర్పాటుకు కాలుష్య నియంత్రణ మండలి ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించడం సరికాదన్నారు. రీ సస్టైనబిలిటీ లిమిటెడ్ ఇచ్చిన ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ రిపోర్టులో ఇచ్చిన అంశాలు వాస్తవాలకు విరుద్ధంగా వున్నాయని పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణ పద్ధతులు, నియమ నిబంధనలు, చట్టపరమైన కనీస సూత్రాలు పాటించని వెల్లడించారు. ఇప్పటికే తాడి, తానాం, బిసి కాలనీ, పరవాడ, లంకెలపాలెం, వల్లూరు, వెంకటాపురం, టి.సిరసపల్లి, కొత్తూరు, అనకాపల్లి పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్రమైన కాలుష్య సమస్యలతో అనారోగ్యం పాలవుతున్నారని చెప్పారు. ఫార్మాలో వున్న 95 పరిశ్రమల వ్యర్థ పదార్థాలతో పాటు విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల ఫార్మా పరిశ్రమల నుండి వ్యర్థ పదార్థాలను పరవాడ ఫార్మాకి తీసుకొచ్చి ఇక్కడ ల్యాండ్‌ఫిలింగ్ చేయడం చట్టవ్యతిరేకమని పేర్కొన్నారు. దీనివల్ల ప్రజల ఆరోగ్యం మీద, పర్యావరణంపైన తీవ్రమైన ప్రభావం పడుతుందన్నారు. పర్యావరణ నిబంధనలు పాటించని ర్యాంకీ యాజమాన్యంపై చర్య తీసుకోవాల్సిందిపోయి, మరో ల్యాండ్‌ఫిల్‌కు అనుమతి ఇవ్వడం దారుణమన్నారు. ల్యాండ్‌ఫిల్‌కు ఏర్పాటుకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని, పర్యావరణ పద్ధతులు, ప్రమాణాలు పాటించేలా ర్యాంకీకి ఆదేశాలివ్వాలని, కాలపరిమితిలోపు సరిచేయకపోతే ర్యాంకీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పిసినికాడ భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

అనకాపల్లి నియోజకవర్గ తుది ఓటరు జాబితాలోని అవకతవకలపైనా, అనకాపల్లి మండలం, పిసినికాడ పంచాయతీలో మంత్రి గుడివాడ అమర్నాథ్, వైసిపి గ్యాంగ్ చేస్తున్న 80ఎకరాల డి పట్టా భూముల కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ కలెక్టర్ రవి పటాన్ శెట్టికి సోమవారం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఆ గ్రామ ఉప సర్పంచ్ బెజవాడ చంద్రకళ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి, డిఎంహెచ్‌ఒ, డిఆర్‌ఒ

డీవార్మింగ్ డే పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- అనకాపల్లి

ఫిబ్రవరి 9వ తేదీన నిర్వహించే డి-వార్మింగ్ డే రోజున పిల్లలందరికీ నులిపురుగుల నుండి రక్షణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పక వేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి పిలుపునిచ్చారు. సోమవారం స్పందన కార్యక్రమంలో ఆయన జెసి ఎం.జాహ్నవి, డిఆర్‌ఓ బి.దయానిధిలతో కలిసి "ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నులిమేద్దాం " అనే పోస్టర్ ఆవిష్కరించారు. 1 నుండి 19 సంవత్సరాల లోపు వయసు పిల్లలు, కిశోర బాలలకు అల్బెండజోల్ 400 మిల్లీగ్రాముల మాత్ర అంగన్వాడీలు, పాఠశాలలు, కళాశాలలో ఉచితంగా ఇస్తారని చెప్పారు. 9తో పాటు ఫిబ్రవరి 16 తేదీలో జరిగే మాప్-అప్ రోజు కూడా మాత్రను వేయాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ హేమంత్ మాట్లాడుతూ నులిపురుగుల సంక్రమణ ఎక్కువగా ఉన్న పిల్లలు కిశోర బాలలకు మాత్ర వేసుకున్న తరువాత వికారం, కొద్దిగా కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, నీరసం లాంటివి కలిగే అవకాశం ఉంది. ఇవి కొద్దిసేపే ఉండి తగ్గిపోతాయని చెప్పారు.



విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న వైసిపి నేత భరత్‌కుమార్

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని తాళ్లపాలెం జెడ్‌పి హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌లను వైసిపి అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మలసాల భరత్‌కుమార్ చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, వైసిపి మండల అధ్యక్షులు మలసాల కిషోర్, ఎంపీటీసీ సభ్యులు భవాని గణేష్, ఇందల ముసలినాయుడు, పాల సంఘం అధ్యక్షులు గుమ్మడి నారాయణరావు, చిన్ని రాజీవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి పాల్గొన్నారు.

యలమంచిలి : మండలంలోని పేట బయ్యవరం పాఠశాలలో 23 మంది విద్యార్థులకు ట్యాబులను సర్పంచ్ మొగ్గా సత్యనారాయణ సోమవారం పంపిణీ చేశారు. హెచ్ఎం యు.వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంల గొన్నాబత్తుల శివ, ఎంపిటిసి వూటికూటి శేఖర్, ఉపాధ్యాయులు బొడ్డేడ సత్యనారాయణ, పీలా రవీంద్ర, కె. వీరభద్రరావు, బివి ధనలక్ష్మి, శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి- అనకాపల్లి : మార్చి నెలలో నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలు, ఫిబ్రవరి నెలలో నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలు సజావుగా ప్రశాంతంగా జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం జరిగిన స్పందన కార్యక్రమం తర్వాత ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ, పోలీసు రెవెన్యూ శాఖల సమన్వయంతో పగడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షల సమయాలలో విద్యార్థులకు అనుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపాలని ఏపీ ప్రజా రవాణా శాఖ రీజనల్ మేనేజర్‌ను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో తగిన తాగునీటి సరఫరా చేయాల్సిందిగా జీవీఎంసీ ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. పరీక్షలు నిర్వహించే రోజులలో కళాశాలల్లో విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని ఏపీ ఈపీడీసీఎల్ అధికారులకు సూచించారు. అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్ఈఓ బి. సుజాత మాట్లాడుతూ ఫిబ్రవరి 2వ తేదీన ఎథిక్స్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష 3వ తేదీన ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షా, 22వ తేదీన సమగ్ర శిక్ష ఒకేషనల్ ట్రేడ్ ఎన్ ఎస్ క్యూ ఎఫ్ లెవెల్ 4 థియరీ పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

మెగా వైద్య శిబిరం



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-అనకాపల్లి : డైట్ కళాశాల ఎస్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఈనెల 25 నుండి 31వ తేదీ వరకు ప్రత్యేక శిబిరంలో భాగంగా సోమవారం మెగా వైద్య, కంటి శిబిరం నిర్వహించారు. వైజాగ్ మెడికవర్ హాస్పిటల్స్ వెంకటేశ్వర, పుష్పగిరి నేత్ర వైద్యశాలతో ద్వారా ఈ సేవలను అందజేశారు. అక్కిరెడ్డిపాలెం సర్పంచ్ సాలాపు శాంతి సూరి అప్పారావు దీనిని ప్రారంభించారు. అక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన 110 మంది వెద్య శిబిరానికి, దాదాపు 50 సభ్యులు కంటి శిబిరానికి హజరయ్యారు. డైట్ ఎన్ఎన్ఎస్ యూనిట్ ఆఫీసర్ బి.సుధీర్ కుమార్, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ ఎ.శంకర్‌రావు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో 45 మంది ఎస్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



తారురోడ్డును ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి

తారురోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని చిననందిపల్లి నుండి చేనులపాలెం గ్రామం వరకు రూ.1.12 కోట్లు ఉపాధి హామీ నిధులతో నిర్మించిన తారురోడ్డును సోమవారం ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రారంభించారు. అనంతరం గ్రామంలో బంగారమ్మ తల్లి మహోత్సవం సంధర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కిలపర్తి భాస్కరరావు, వరదపురెడ్డి సింహాచలం నాయుడు, కెవి రమణ పాల్గొన్నారు.

వైసిపి హయాంలో సంక్షేమం, అభివృద్ధి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : వైసిపి ప్రభుత్వం హయాంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమం జరుగుతున్నట్లు ఎలమంచిలి ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజు అన్నారు. మండలంలోని ఎస్ఈజెడ్ కాలనీ వెదురువాడ పోలీస్ గ్రౌండ్స్‌లో స్వయం సహాయక గ్రూపుల మహిళలకు రుణమాఫీ పథకం కింద రూ.11 కోట్ల 20 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. దిబ్బపాలెంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న ఇండోర్ స్టేడియంకు శంకుస్థాపన చేశారు. ఎస్ఈజెడ్ కాలనీలో రూ.44 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.10 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్, ఎస్సీ కాలనీలో రూ.5 లక్షలతో కమ్యూనిటీ భవనం, వెదురువాడలో రూ.17.67 లక్షలతో బల్క్ మిల్క్ కేంద్రం, రూ.23.94 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.16 లక్షలతో డిజిటల్ లైబ్రరీ భవనం, రూ.80 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు.సుకుమార్ వర్మ, ఎంపిపి కోన సంధ్య బుజ్జి, జడ్పిటిసి సభ్యులు లాలం రాంబాబు, కోఆప్షన్ సభ్యుడు కుమార్, మాజీ మండలాధ్యక్షులు చేకూరి శ్రీనివాసరాజు, అచ్యుతాపురం సర్పంచ్ కె విమలనాయుడు, జి.ధర్మవరం సర్పంచ్ గొర్లి అశ్విని నూకరాజు, పెన్నమరాజు వాసు, సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చోడవరంలో సమావేశమైన 1978-80 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- చోడవరం, చోడవరం రూరల్

చోడవరంలో 1978-80 సంవత్సరాల్లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగింది. హైదరాబాదు, విజయవాడ, యానాం, శ్రీకాకుళం, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో ఉన్నతోద్యోగాలలో ఉన్నవారు, ఉద్యోగ విరమణ చేసినవారు, వివిధ వృత్తులు, వ్యాపారాల్లో కొనసాగుతున్న వారు తమ కుటుంబాలతో సహా దీనికి హాజరయ్యారు. అందరూ తాము చదువుకున్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆత్మీయంగా, ఆప్యాయంగా ఒకరినొకరు పలుకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. 2011లో ఏర్పాటు పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పాటు చేయగా, ఈ కాలంలో సంఘం ద్వారా చేసిన కార్యక్రమాలను కొత్త వచ్చిన సభ్యులకు తెలియజేశారు. ఒక కామన్ గుడ్ ఫండ్‌ను ఏర్పాటు చేసుకొని తమలో మరణించిన, తీవ్ర అనారోగ్యంతో బాధిపడుతున్న వారికి ఆర్థికంగా చేయూత ఇచ్చామని, కరోనా సమయంలో చోడవరం మీదుగా నడిచి వెళ్ళిన వలస కార్మికులకు కావలసిన అన్న పానీయాలను అందించామని చెప్పారు. ఈ సంఘ సభ్యులలో ఇద్దరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అలూమ్నీ అసోసియేషన్ కు ఛైర్మన్, వైస్ ఛైర్మన్లుగా ఉన్నారని, ఆ కళాశాలకు శాశ్వతంగా ఉపయోగపడేలా ఒక కార్యక్రమం చేయాలని నిర్ణయించుకున్నామని తెలియజేశారు. దీనికి స్పందించిన రిటైర్డ్ సీనియర్ ఆడిట్ ఆఫీసర్ కోటిపల్లి కృష్ణాజీ, శ్రీకాకుళం సూపరింటెండెంట్ ఇంజనీర్ వింజమూర్తి సత్య నారాయణమూర్తి, ఐటిడిఏ గృహనిర్మాణ శాఖ ఇంజనీర్ మండల గౌరీశంకర్ తాము ఆర్థిక సహాయాన్ని అందిస్తామని ప్రకటించారు. మున్ముందు మరిన్ని మంచి కార్యక్రమాలు చేయాలని నిర్ణయించారు.

కశింకోట జెడ్‌పి పాఠశాల పూర్వ విద్యార్థులు...

కశింకోట : కశింకోట డిపిఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1982-83 పదో తరగతి బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు బయ్యవరం ప్రమీలా గార్డెన్స్‌లో సోమవారం కలుసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారు చదువుకున్న రోజులను గుర్తుకు తెచ్చుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలకు తమ వంతుగా సాయం అందించాలని ఈ సందర్భంగా తీర్మానించుకున్నారు. ప్రతి ఏటా కలుసుకోవాలని అనుకున్నారు.

అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డును పునర్నిర్మించాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి- అనకాపల్లి

పూర్తిగా శిథిలమైన అచ్యుతాపురం -అనకాపల్లి రోడ్డును తక్షణమే పునర్నిర్మించి ప్రమాదాలు నివారించి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరుతూ సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి లోకనాథం మాట్లాడుతూ అనకాపల్లి అచ్యుతాపురం రోడ్‌లో ఎస్ఈజెడ్, ఎన్ఏటిబి, ఫార్మాసిటీ కంపెనీలకు రోజు వందలాది బస్సులు లారీలు రాకపోకల వల్ల భారీ గుంతలు ఏర్పడి రోడ్డు పూర్తిగా శిథిలమైందని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో అధ్వానంగా తయారైన ఈ రోడ్డులో పలువురు ప్రమాదాలకు గురై అంగవైకల్యానికి గురవడం, ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో గర్భిణీ స్త్రీలు, వృద్ధుల బాధలు వర్ణనాతీతమన్నారు. రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు మంత్రి, ఎమ్మెల్యేలు, ఆర్ అండ్ బి అధికారులకు విన్నవించినా ప్రయోజనం శూన్యమన్నారు. గట్టిగా గొడవ చేస్తే శాశ్వత పరిష్కారం వైపు చూడకుండా క్రషర్ స్వారీ బుగ్గితో తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ప్రజాధనాన్ని కాజేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని విడనాడి అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డును యుద్ధ ప్రాతిపదికపై నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కర్రి అప్పారావు, రాము సదాశివరావు, అనకాపల్లి అచ్యుతాపురం మండలాల కన్వీనర్లు గంట శ్రీరామ్, ఆర్ రాము, బ్రహ్మాజీ, బాబూరావు, తేలయ్య బాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు



చెరుకు కాటా వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

చెరుకు తరలింపులో నిర్లక్ష్యంపై నిరసన

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని సూరెడ్డిపాలెం చెరుకు తూనిక కేంద్రం నుండి చెరుకు తరలింపులో గోవాడ సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం చేస్తున్న నిర్లక్ష్యంపై రైతు సంఘం ఆధ్వర్యాన రైతులు కాటా వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు, నాయకులు వనం సూర్యనారాయణ మాట్లాడుతూ చెరుకు కాటాల వద్ద వారాల తరబడి పేరుకుపోతున్న చెరుకును సుగర్ ఫ్యాక్టరీకి తరలించడానికి యాజమాన్యం తగినన్ని లారీలు ఏర్పాటు చేసి తరలించాలని డిమాండ్ చేశారు. సకాలంలో లారీలు పంపకపోవడంతో కాటా వద్ద వారం రోజుల క్రితం తెచ్చిన చెరుకు ఇప్పటికీ కూడా తూకం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చెరుకు రైతుకు ఇప్పటికే సరైన గిట్టుబాటు ధర లేదని, ఫ్యాక్టరీకి తరలించిన చెరుకు పేమెంట్ కూడా సకాలంలో ఇవ్వటం లేదని, అదే సందర్భంలో చెరుకు తరలించకుండా కాటాల వద్ద ఉంచడంతో అది ఎండిపోయి రైతులకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం సూరెడ్డిపాలెం చెరుకు కాటా నుండి తక్షణమే చెరుకు తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు వనం సత్యం, బొడ్డు రామునాయుడు, రొంగలి తాతబాబు, జామి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- అనకాపల్లి : సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక సోమవారం సంఘ కార్యాలయంలో జరిగింది. అధ్యక్షునిగా బల్లా నాగభూషణం, ఉజ్జి సత్యనారాయణ (గౌరవాధ్యక్షులు), పట్నాల కృష్ణ మోహన్ (ఉపాధ్యక్షులు), వినకోట నీలేశ్ గుప్తా (కార్యదర్శి), రొబ్బి మల్లేశ్వరరావు, బల్లా శ్రీనివాసరావు (సహాయ కార్యదర్శులు), కార్యవర్గ సభ్యులుగా కొత్తూర్తి రామారావు, బొడ్డు సోమరాజు, పిరాట్ల నరసింహ మూర్తి, రొబ్బి చంద్రరావు, దేగల రామ్ ప్రసాద్, బూడిద జోగారావు, దువ్వారి నేతాజీ, పొన్నా వెంకట చలమాజీ,కాపారపు సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కాంగ్రెస్ టికెట్‌కు శశికుమార్ దరఖాస్తు

ప్రజాశక్తి-చోడవరం : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో చోడవరం నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడానికి కచ్చా శశి కుమార్ సోమవారం కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి విజయవాడ ఆంధ్ర భవన్ దరఖాస్తు అందజేశారు. వార్ రూమ్ చైర్మన్ వేగి వెంకటేష్, కో చైర్మన్ బి సోమశేఖర్, డిసిసి అధ్యక్షులు బొడ్డు శ్రీనివాసరావు, పెందుర్తి ఇన్‌ఛార్జి ఆడారి రమేష్ నాయుడుతో కలిసి కచ్చా శశి కుమార్ దరఖాస్తును సమర్పించారు.

నర్సింగబిల్లిలో అన్నదానం

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని నర్సింగబిల్లి గ్రామంలో పొన్నగంటి వరకృష్ణ, న్యాయవాది పొన్నగంటి నూకరాజు జ్ఞాపకార్థం సోమవారం అన్నదానం, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ మాజీ సభ్యులు పొన్నగంటి మణి, పొన్నగంటి సాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-చోడవరం : పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర్లో ఉన్న ఎకరా 50 సెంట్లు ప్రభుత్వ భూమి ఆక్రమణను ఆపాలని కోరుతూ జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్.రాజు ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి ఆక్రమిత స్థలం వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ప్రభుత్వ భూమి ఆక్రమణ చేసి గ్రావెల్‌తో పూడ్చడం వల్ల దాని కింద ఉన్న చెరువు గర్భానికి నీటి లభ్యత తగ్గిపోయిందని తెలిపారు. స్థానిక వైసిపి ప్రజా ప్రతినిధులు అవినీతిపరులకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాలుగు మండలాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మండల పరిషత్తు సమావేశంలో సమస్యలపై నిలదీత



ఎంపిడిఓ వీడ్కోలు కార్యక్రమంలో మాట్లాడుతున్న తహశీల్దారు

ప్రజాశక్తి - సబ్బవరం

స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి బోకం సూర్యకుమారి అధ్యక్షతన సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలపై సభ్యులు అధికారులను నిలదీశారు. ముందుగా ఎంపిపి మండలంలోని సమస్యలపై సర్పంచులు, ఎంపీటీసీలతో సమీక్ష నిర్వహించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పైడివాడ అగ్రహారం, అసకపల్లి సర్పంచ్‌లు వడ్డాది అప్పలరాజు, కర్రి నరసింగరావు తమ గ్రామాల్లో విద్యుత్ సమస్య తీవ్రంగా చెప్పారు. బంగారమ్మ పాలెం ఎంపీటీసీ రాపేటి అరుణ రాము ఫ్యామిలీ మెంబర్ ధ్రువపత్రం లేకపోయినా, సబ్ రిజిస్ట్రార్ సిబ్బంది లంచం తీసుకుని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. తవ్వవానిపాలెం సర్పంచ్ బోకం స్వామినాయుడు జల్ జీవన్ మిషన్ కింద తమ గ్రామానికి తాగునీటి కుళాయిలు మంజూరు చేసినా, వాటర్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదని, 10 రోజుల్లో నిధులు మంజూరు చేసినది, లేనిది చెప్పాలని అధికారులను నిలదీశారు. పైడివాడ అగ్రహారం ఎంపిటిసి సీరం అప్పలరాజు స్మశాన వాటికకు కాంపౌండ్ వాల్ నిర్మాణం చేయాలని కోరారు. పలువురు సర్పంచులు గ్రావెల్ కొరత వల్ల గ్రామాల్లో మంజూరైన రోడ్ల నిర్మాణం ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్థానిక తహసిల్దార్ బి.సత్యనారాయణ బదులిస్తూ గ్రావెల్ తవ్వకాలకు అనుమతి ఇచ్చే అధికారం తమకు లేదన్నారు. ఎంపీపీ బోకం సూర్యకుమారి ఐసిడిఎస్ శాఖ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఎంపీడీవో రమేష్ నాయుడును ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి మహేష్, ఏవో షేక్ బాబురావు, వైస్ ఎంపీపీ శరగడం ఝాన్సీ లక్ష్మీ రాణి, సబ్బవరం సర్పంచ్ డి. ప్రసాదరావు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు పైలా ప్రసాదరావు

అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - కె.కోటపాడు : మండలంలోని మేడిచర్ల గ్రామంలో శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ 17వ వార్షికోత్సవ కార్యక్రమం సోమవారం జరిగింది. ఇందులో తెలుగుదేశం పార్టీ మాడుగుల నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పూడి నారాయణమూర్తి, పూడి శ్రీను, ఆలయ కమిటీ ప్రతినిధులు ఆదిరెడ్డి మహేష్, బొడ్డు వెంకటరావు, ఆర్‌సి నాయుడు, బొడ్డు కృష్ణారావు, ఎ.కోడూరు సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, టిడిపి క్లస్టర్ ఇంచార్జి లెక్కల మల్లేశ్వరరావు, సింగన్నదొరపాలెం సర్పంచ్ వెలగల పైడంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి మ్యానిఫెస్టోపై ప్రచారం చేయాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోపై గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేయాలని ఎలమంచిలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. అచ్యుతాపురం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో సోమవారం బూత్ ఏజెంట్ల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీ గెలుపుకు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, నియోజకవర్గ పరిశీలకులు బొండ జగన్, టిడిపి నాయకులు రాజాన రమేష్ కుమార్, జనపరెడ్డి నరసింగరావు, మేరుగు బాపు నాయుడు, డ్రీమ్స్ నాయుడు, భీమరశెట్టి శ్రీనివాసరావు, మామిడి శివ అప్పారావు, యాంద్ర అప్పలనాయుడు, ట్రైనర్స్, పతివాడ చిన్నయ్య నాయుడు పాల్గొన్నారు.

టిడిపి ఇంటిగ్రేటెడ్ శిక్షణ

గోపాలపట్నం : విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు అధ్యక్షతన స్థానిక క్యాంపు కార్యాలయంలో టిడిపి కేడర్‌కు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. నియోజకవర్గ పరిధిలోని పలువార్డుల కార్పొరేటర్లు, క్లస్టర్లు, యూనిట్ ఇన్చార్జులు, బూత్ కన్వీనర్లు, మహిళా బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

ములగాడ : 58వ వార్డు పరిధి పిలకవాని పాలెం వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో సోమవారం సాయంత్రం టిడిపి కార్పొరేటర్లు, జిల్లా నాయకులు, క్లస్టర్లు,యూనిట్ ఇన్‌ఛార్జిలు, బూత్ కన్వీనర్లు, మహిళా కన్వీనర్లకు పార్టీపరంగా ఇంటిగ్రేటెడ్ శిక్షణనిచ్చారు. ఎమ్మెల్యే గణబాబు పాల్గొని, పార్టీ శ్రేణులకు ఎన్నికల సన్నద్ధతపై వివరించారు.



మాట్లాడుతున్న విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

జీడి తోటలకు ఈ-క్రాప్ నమోదు చేయాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని గిరిజన ప్రాంతాల్లో పేద గిరిజన రైతులు సాగు చేస్తున్న జీడి మామిడి తోటలకు వెంటనే ఈ-క్రాప్ నమోదు చేయాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బిటి దొర డిమాండ్ చేశారు. మండలంలోని వాలాబు పంచాయతీ పరిధిలో గిరిజనులతో కలిసి సోమవారం ఆయన జీడితోటలను పరిశీలించారు. అనంతరం దొర మాట్లాడుతూ గిరిజనులకు సుమారు 1800 పోడు భూముల పట్టాదారులు ఉన్నారని, వారికి ఉపాధి హామీ పథకం కింద 100 రోజులకు మరో 50 రోజులు పెంచి 150 రోజులు పని రోజులు కల్పించాలని కోరారు. పెంచిన 50 రోజులు జీడి మామిడి తోటల్లో తుప్పలు తొలగించడానికి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీడి మామిడి పంటను రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని, పంటలకు ఈక్రాప్ నమోదు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కారం చేయకుంటే మండల కేంద్రంలో ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇరటా దేముడు, మజ్జి ఎర్రయ్య, బలిజ నాగేశ్వరరావు, గిరిజన రైతులు పాల్గొన్నారు.



జీడితోటలో నినాదాలు చేస్తున్న గిరిజన రైతులు

దేవాలయాలకు టిటిడి నిధులు మంజూరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం నియోజకవర్గంలో 104 దేవాలయాలకు టీటీడీ రూ.10 కోట్ల 30 లక్షల మంజూరు చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తెలిపారు. రోలుగుంట, రావికమతం, చోడవరం, బుచ్చయ్యపేట మండలాల్లో 150 దేవాలయాలకు నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపించామని, వాటిలో మొదటి విడతగా టీటీడీ 104కి మంజూరు చేసిందని, మిగతా వాటికి త్వరలోనే నిధులు మంజూరవుతాయని చెప్పారు. చోడవరం కేశవస్వామి, గవరేశ్వర, స్వయంభు విఘ్నేశ్వర ఆలయాలకు రూ.75 లక్షలు మంజూరు చేయాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ రాఘవరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడవక సత్యారావు, దేవాదాయ శాఖ ఈవో సత్యనారాయణ, స్థానిక ఎంపీపీ గాడి కాసు, బొడ్డేటి సూర్యనారాయణ, పుల్లేటి వెంకట్రావు, జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాగులో ఉన్న గిరిజన రైతులకు

ఆర్‌ఒఎఫ్‌ఆర్ పట్టాలు ఇవ్వాలి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:సాగులో ఉన్న గిరిజన రైతులకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఇవ్వాలని సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద నాతవరం, గొలుగొండ మండలాలకు చెందిన గిరిజన రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు మాట్లాడుతూ, గొలుగొండ, నాతవరం మండలాల్లో అనేక ఏళ్లుగా గిరిజన రైతులు అటవీ పోడు వ్యవసాయం చేస్తు న్నారన్నారు. పారెస్టు, రెవిన్యూ అదికారులు సర్వేలు జరిపి పట్టాలు ఇవ్వలేదని విమర్శించారు. గొలుగొండ మండలం బుడ్డడపాడు, సుద్దలపాలెం, అడ్డరలోవ గ్రామ గిరిజన రైతులు అనేక తరాలుగా ప్రభుత్వ భూములను సాగు చేసుకొని జీవిస్తున్నారని, వీరు సాగు చేస్తున్న భూములకు సర్వే జరిపి గిరిజన రైతుల పేరున పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సదరు భూములు గిరిజనేతరుల పేరున ఉన్న ఆ రికార్డులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం, అధికారులు, నాయకులు స్పందించి ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, ఈరెల్లి చిరంజీవి, కన్నబాబు, ఎం.నాగమణి, శివ, రాము పాల్గొన్నారు.



ధర్నా చేపడుతున్న సిపిఎం నేతలు, గిరిజనులు

రంగాల జగదీష్

కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని రాజయ్యపేట గ్రామానికి చెందిన రంగాల జగదీష్ కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 25వ తేదీన ఇదే గ్రామంలో కూలి పనికి వెళ్లి సెప్టిక్ ట్యాంక్ గొయ్యి తీసి, సిమెంటు తూరలు వేసే క్రమంలో ఒక్కసారిగా ఇసుక మేట పడడంతో ట్యాంక్ గొయ్యిలోనే ఊపిరాడక రంగాల జగదీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. జగదీష్ ప్రమాదవశాత్తు మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యులు అనాధలయ్యారు. కుటుంబ పెద్ద కోల్పోవడంతో మృతుని తల్లిదండ్రులు, భార్య నూకేశ్వరి, ఏడాదిన్నర పాప దిక్కులేని వారయ్యారు. మృతుని భార్య నాలుగు నెలల గర్భిణీ. ఈ మేరకు మృతుని భార్య నూకేశ్వరి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ ఎంపీడీవోకు లేఖను రాసారు. తన భర్త ప్రమాదవశాత్తు మరణించడంతో కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కును కోల్పోయామని, తన భర్త పేరిట గ్రామంలో వై యస్ ఆర్ భీమా పథకం నమోదు కాలేదన్నారు. తమ పేదరికాన్ని, కుటుంబ పరిస్థితిని అర్ధం చేసుకొని వైయస్సార్ భీమా, ఇతర ఏ మిధమైన పధకాలు అయినా వర్తింప జేయాలని కోరారు. ఈ మేరకు సోమవారం రాజయ్యపేట స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ బి.అప్పలరాజు, 10వ వార్డు మెంబర్ ఎం.మహేష్ బాబు, ఆర్.తాతాజీ లు ఈఓపిఆర్‌డి సత్యనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని వారు కోరారు.



వినపత్రాన్ని ఇస్తున్న చైర్మన్, నాయకులు

సిఇఒను మార్చాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి-మాకవరపాలెం:ఏసిబి కేసు విచారణలో ఉండగా ప్రమోషన్ ఇచ్చిన మాకవరపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిఇఒ గోవిందను తక్షణమే మార్పు చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బొంతు రమణ కోరారు. సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ, మాకవరపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సంఘ నామిటేడెట్ బోర్డు కొత్త ఉద్యోగులను తమ ఇష్టం వచ్చినట్లు నియమించుకుందన్నారు. సదరు నామినేటేడ్ బోర్డు నియమించి సుమారు ఐదేళ్లు అవుతుందన్నారు. ఈ కాలంలో కొత్తగా ముగ్గురిని నియమించారన్నారు. సంఘంలో స్టాప్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శీరంరెడ్డి గోవిందను ఏసిబి అధికారులు ఆదాయంనకు మించి ఆస్తులు ఉన్నాయని, కేసు నమోదు చేయడంతో జైలు శిక్ష అనుభవించారన్నారు. ప్రస్తుతం గోవిందను తిరిగి స్టాప్ అసిస్టెంట్‌గా నియమించి ఎసిబి కేసు పూర్తయ్యే వరకు సగం జీతం ఇచ్చే విధంగా ఉద్యోగం కల్పించారన్నారు. అంతటితో ఆగకుండా గోవిందను ఇప్పుడు సిఇఒగా పదవి బాధ్యతలు అప్పగించడం సరైంది కాదన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన మోడల్ పరీక్షలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్టూడెంట్ ఫెడరేషన్ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో టాప్ 15 విద్యార్థులకు సోమవారం బహుమతులు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన టాప్ 15 పరీక్షల్లో 700 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిలు గా హాజరైన ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎం నీలవేణి మాట్లాడుతూ, టెన్త్ క్లాస్ మోడల్ టెస్ట్ అనేది చాలా మంచి ఉద్దేశమన్నారు. ఇలాంటి పరీక్షలు అలవాటు చేసుకోవడంతో కాంపిటేటివ్ విధానం అలవాటు అవుతుందని తెలిపారు. టెన్త్ తర్వాత ఏపీ ఆర్ ఎస్, పాలిటెక్నిక్ తదితర కోర్సులపై దృష్టి సారించాలన్నారు. భవిష్యత్తులో ఎస్ఎఫ్ఐ ఇంకా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. అనంతరం బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ ఎం.రమణ, జిల్లా అధ్యక్షులు గీతా కృష్ణ, జిల్లా జాయింట్ సెక్రటరీ ప్రసాద్, డివైఎఫ్ జిల్లా అధ్యక్షులు శివాజీ, డివిజన్ ప్రెసిడెంట్ గౌతమ్, మాజీ జిల్లా నాయకులు రాజు, మండల సెక్రటరీ రాజు, డివిజన్ సభ్యులు జ్ఞానేష్, గంగ, ఉపేంద్ర, వెంకటేష్, నాగేంద్ర పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ నేతలు

చినుకు పడితే రహదారి చిత్తడే...

ప్రజాశక్తి-రోలుగుంట:మండల కేంద్రమైన రోలుగుంట గ్రామంలో ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాల కూడలి వద్ద ఆర్అండ్‌బి రోడ్డు ఇటీవల కురిసిన వర్షానికి చెరువును తలపిస్తోంది. దీంతో, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. 2021 ఏడాదిలో నిధులు మంజూరైనా ఇప్పటికీ రోడ్డు నిర్మాణం కనీసం 50 శాతం కూడా పూర్తి కాలేదు. ఈ రహదారి మీదుగా జిల్లా, రాష్ట్ర నాయకులు కూడా ప్రయాణిస్తుంటారు. ఇటీవల అధికార పార్టీ నాయకులు రోడ్డు పనులు 80 శాతం పూర్తయ్యాయని సభల్లో గొప్పలు చెప్పినా వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది.

రోలుగుంట మండలం పరిధిలో కొత్తకోట గజాల కట్టు నుండి వెలంకాయల జంక్షన్ వరకు సుమారు ఎనిమిది కిలో మీటర్ల మేర ఉన్న 10 కల్వర్టులను తెరిచారు. వాటిలో ఇరువైపులా పూర్తయినవి రెండే రెండు. మిగితా కల్వర్టు పనులు పూర్తి కాలేదు. ఇంకా నాలుగైదు కల్వర్టులు శిథిలావస్థలో ఉన్నాయి. కల్వర్టులు పూర్తి చేయలేదు. ఈ రోడ్డు ఇరువైపులా మూడు అడుగుల మట్టి తీశారు.



రోడ్డుపై చేరిన నీరు



అవగాహన కల్పిస్తున్న సిఐ

చట్టాల అమలుపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-మాడుగుల: షెడ్యూల్ కులాలు, తెగలు, చట్టాల అమలుపై సిఐడి శాఖ అవగాహన సదస్సు నిర్వహించింది. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ పీవీ రత్నం ఆధ్వర్యంలో విశాఖపట్నం సిఐడి రీజినల్ కార్యాలయ సిఐ బి.వి.జి.ప్రసాదరావు అధ్యక్షతన షెడ్యూల్ కులాలు, తెగల అభివృద్ధిపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 17ను అనుసరించి షెడ్యూల్ కులాలు, తెగల సామాజిక వర్గాల రక్షణ నిమిత్తం చట్టాలు చేయడం జరిగిందన్నారు. సమాజంలో షెడ్యూల్ కులాల, తెగల సామాజిక వర్గాల ప్రజలు అనుకున్నంత ప్రగతి సాధించలేకపోతున్నారని, ఈ నేపథ్యంలో అవగాహన కల్పించి వారిని చైతన్యవంతులు చేయాలని అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

తహసిల్దార్ పీవీ రత్నం మాట్లాడుతూ, షెడ్యూల్ తెగల, కులాల చట్టాలపై అవగాహన కలగించడానికి ఇది మంచి వేదికగా ఉపయోగపడుతుందని అన్నారు. ఇన్చార్జ్ ఎంపీపీ తాళపురెడ్డి రాజారామ్ మాట్లాడుతూ, సామరస్యంగా అందరం కలిసి మెలిసి ఉంటున్నామని తెలిపారు. షెడ్యూల్ కులాల నాయకులు సమస్యలను అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐడి రీజనల్ కార్యాలయ ఎస్సై ఆర్ కోటేశ్వరరావు, స్థానిక పోలీస్ ఎస్సై 2 నాగరాజు, ఇన్చార్జి ఎంపీపీ రాజారామ్, జడ్పిటిసి కిముడు దేవుడమ్మ, వైస్ ఎంపీపీ శ్రీను, సర్పంచ్ యడ్ల కళావతి, సర్పంచులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై

1 నుంచి ప్రచారం

- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోటేశ్వరరావు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: బిజెపి ప్రజావ్యతిరేక విధానాలపై పిబ్రవరి 1వ తేదీ నుండి ప్రజల్లో ప్రచారం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి కోటేశ్వరరావు తెలిపారు. సిపిఎం నర్సీపట్నం నియోజకవర్గం సమావేశం సోమవారం సిపిఎం కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టక ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. గత ప్రభుత్వాలు పరిశ్రమలను నిర్మించి, ఉపాది అవకాశాలు కల్పించి విద్యా, ఉపాధి, ఆరోగ్యం, సంక్షేమాలను ప్రజలకు అందించామని తెలిపారు. నేడు బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ పరిశ్రమలను, సంస్థలను ప్రైవేటీకర్తిందని విమర్శించారు. అందుకే ఎన్నడు లేని విదంగా దేశంలో నిరుద్యోగం పెరిగిందన్నారు. నిత్యావసర వస్తువులు ధరలకు అదుపు లేదన్నారు. మతోన్మాద విచ్చినకర చర్యలకు పాల్పడుతుందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపిలు తమ రాజకీయ ప్రయోజనాలకు తలొగ్గి బిజెపితో రాజీ పడుతున్నాయని విమర్శించారు. రాష్ట్రానికి రావలసిన నిధులు, విభజన హామీలు కేంద్రం విస్మరించినా అడగలేని పరిస్థితి ఉందన్నారు. ప్రజల కోసం నిరంతర పోరాడే సిపిఎం పార్టీని అదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ కమీటి సభ్యులు అడిగర్ల రాజు, సీనియర్ నాయుకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, ఈరెల్లి చిరంజీవి, ఎల్.గౌరి, కెవి.సూర్యప్రభ, టి.ఈశ్వరరావు, శివ, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.



పథకాలపై ప్రచారం చేపడుతున్న టిడిపి నేతలు

ఆరు గ్యారెంటీలపై టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట:మండలంలో ఎల్బీ పురం గ్రామంలో సోమవారం బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీపై ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ దొండా శ్రీను మాట్లాడుతూ, రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు భరోసాగా ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి 18,000, చదువుకునే ప్రతి ఒక్కరికి 15 వేలు అందజేయడం జరుగు తుందన్నారు. అన్నదాత పథకం కింద ఏడాదికి ఒక్కో రైతుకు రూ.20,000 నిరుద్యోగులకు రూ.3000 చొప్పున భృతి చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయం శేషు పాల్గొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ మూడో వార్డులో సోమవారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ఆధ్వర్యాన బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్న ఆరు గ్యారెంటీలపై విస్తృత ప్రచారంచేశారు. ఇంటింటికీ వెళ్లి ముద్రించిన కరపత్రాలను అందజేశారు.రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన ఉమ్మడి ప్రజా ప్రభుత్వం ఏర్పాటు తథ్యమని, అన్నివర్గాల ప్రజలకు మేలు చేసే పథకాలతో ప్రజారంజక పాలన సాగిస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఎం సంజీవ్‌కుమార్, కొక్కిరి అప్పన్న, కనకల అప్పలనాయుడు, వంశీ పాల్గొన్నారు

అనకాపల్లి : జివిఎంసి 81వ వార్డు పరిధి వేగి గౌరీష్ గారి వీధి సంతోషిమాత గుడి రోడ్డు ఏరియాలో టిడిపి అనకాపల్లి జిల్లా పార్లమెంట్ కార్యదర్శి మళ్ళ గణేష్ ఆధ్వర్యంలో బాబు షూరిటీ - భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టిడిపి హామీలను మహిళలకు గణేష్ వివరించారు. కార్యక్రమంలో పీలా రమణారావు,మళ్ళ రామకష్ణ మద్దాల రామకృష్ణ పాల్గొన్నారు.

84వ వార్డులో

జివిఎంసి 84వ వార్డు లక్ష్మీ నారాయణ నగర్, రింగ్ రోడ్డు ప్రాంతాల్లో రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు మాధంశెట్టి నీలబాబు ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి పీలా గోవింద సత్యనారాయణ, మళ్ళ సురేంద్ర, కొణతాల ఉమా, తలారి లక్ష్మి ప్రసాద్ పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న సర్పంచ్

జోగుంపేటలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-గొలుగొండ:ఈ నెల 30న గొలుగొండ మండలం జోగుంపేటలో సచివాలయ ప్రారంభోత్సవం నేపథ్యంలో గ్రామంలో పారిశుద్య పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. సర్పంచ్ జువ్వల లక్ష్మి, ఉప సర్పంచ్ లాలం సోమునాయుడు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలో ఉన్న రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిటికెల వరహాలబాబు, మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షులు జువ్వల దేముడు, వార్డు మెంబర్ చిట్ల అప్పారావు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో ఈ నెల 30న ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ పర్యటించ నున్నారని మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు కొత్తమల్లంపేట, పాతమల్లంపేట, సిహెచ్.యర్రవరం సచివాలయాలు ప్రారంభిస్తారన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్, జెడ్పీటీసీ, ఎంపిపి, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

చిల్లర వర్తకులకు ఉపాధి రక్షణ కల్పించాలి

- సిఐటియు

ప్రజాశక్తి- కలెక్టరేట్ :తోపుడు బళ్ళు, బడ్డీలలో వ్యాపారాలు చేస్తూ, జీవనం సాగిస్తున్న వారికి జీవీఎంసీ హామీ ఇచ్చిన మేరకు ఆఖరి జోన్లు ఏర్పాటు చేసి ఉపాధి రక్షణ కల్పించాలని విశాఖపట్నం తోపుడుబండ్ల కార్మిక సంఘం (సిఐటియు) గౌరవ అధ్యక్షుడు పి. వెంకటరావు, జిల్లా కార్యదర్శి ఎ.సింహాచలం కోరారు. సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ, మద్దిలపాలెం హైవేపై ఉన్న తోపుడుబండ్ల కార్మికులకు హాకర్ జోన్ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలన్నారు. జివిఎంసి వెండింగ్ బోర్డు ఏర్పాటు చేసిందని, ఇక్కడ ఎనిమిది సంవత్సరాలుగా హాకర్ జోన్ ఏర్పాటు చేయలేదని తెలిపారు. షాపులు నిర్మించి విద్యుత్ సరఫరా, మంచినీరు, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. 32 తోపుడు బళ్లకు షాపులు కేటాయించాలన్నారు. ఇదే ప్రాంతంలో మద్దిలపాలెం డిపోకు చెందిన ఆర్టీసీ స్థలంలో రోడ్ ఫేసింగ్‌లో 5 షాపుల నిర్మాణానికి టెండర్లు పిలవడం జరిగిందని, వాటి నిర్మాణం చేయలేదని తెలిపారు.మరో ఐదు నుంచి పది షాపులు నిర్మించడానికి ఆర్టీసీ సిద్ధంగా ఉందన్నారు. వీటి నిర్మాణం త్వరగా చేపట్టి తోపుడుబండ్ల కార్మికులను ఆదుకోవాలని కోరారు. ద్వారకానగర్ 4,5 లైన్లలో 20 సంవత్సరాలుగా తోపుడుబండ్లు, బడ్డీలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న చిల్లర వర్తలకు ఉపాధి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.అనంతరం జివిఎంసి ప్రధాన కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి,స్పందనలో కమిషనర్ కు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు వై.నారాయణరావు, కోలా శ్రీనివాసరావు, రాజి, రాము, ప్రసాద్, సిఐటియు సీనియర్ నాయకులు అనపర్తి అప్పారావు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు

భూయాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

మహిళా న్యాయవాదుల ర్యాలీ

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : భూయాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలన్న డిమాండ్‌తో విశాఖపట్నం న్యాయవాదులు 45రోజులుగా చేపడుతున్న రిలే నిరాహార దీక్షల్లో భాగంగా సోమవారం మహిళా న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. జిల్లాకోర్టులోని దీక్షా శిబిరం నుంచి జివిఎంసి గాంధీ బొమ్మ వరకు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు కోరుతూ గాంధీజీకి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మళ్లీ దీక్షా శిబిరం వద్దకు ర్యాలీగా చేరుకున్నారు. ఈ సందర్భంగా విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చింతపల్లి రాంబాబు, పైలా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంటనే ఈ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని, లేకుంటే తమ ఆందోళనను ఉధృతం చేస్తామని, అవసరమైతే రాష్ట్రబంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. వచ్చేనెల 7 వరకుకోర్టు విధులను బహిష్కరించి న్యాయవాదులంతా వివిధ పద్ధతుల్లో నిరసన తెలియజేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి అక్కడి రైతులు, ప్రజలకు ఈ చట్టం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈనెల 30న మంగళవారం నిర్వహించే కారు ర్యాలీలోనూ న్యాయవాదులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు

గాజువాక.: ఎపి భూయాజమాన్యహక్కు చట్టం ప్రజా వ్యతిరేకమని, దీన్ని తక్షణమే రద్దు చేయాలని గాజువాక బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సోమవారం గాజువాక బార్ అసోసియేషన్ ప్రతినిధులు వంద అడుగుల రోడ్డులోనిఅంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, అనంతరం వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో న్యాయవాది, జివిఎంసిలో సిపిఐ ఫ్లోర్‌లీడర్ ఎజె స్టాలిన్, గాజువాక బార్ అసోసియేషన్ కార్యదర్శి బివిఎం కృష్ణ , సీనియర్ న్యాయవాదులు వెన్నెల ఈశ్వరరావు, ఎవి లెనిన్, ఎం.నరేంద్ర, సుధాకర్, జి. చిరంజీవి, బి.ప్రభాకరరావు, పలువురు మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు .



నిరసన చేపడుతున్న న్యాయవాదులు

ప్రొద్దుటూరు క్లాప్ డ్రైవర్‌ది ప్రభుత్వ హత్యే

-జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రాజు



నిరసన చేపడుతున్న యూనియన్ నేతలు, క్లాప్ డ్రైవర్లు

ప్రజాశక్తి- కలెక్టరేట్:ప్రొద్దుటూరు క్లాప్ డ్రైవర్ ది ఆత్మహత్య కాదని, ప్రభుత్వ హత్యే నని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రాజు ఆరోపించారు. క్లాప్ డ్రైవర్ ఆంజనేయులు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, ప్రొద్దుటూరు మున్సిపాలిటీ క్లాప్ డ్రైవర్ ఆంజనేయులు అప్పుల బాధ తాళలేక, 8 నెలలుగా జీతాలు అందక ఆత్మహత్య చేసుకోవడం జరిగిందన్నారు. దీన్ని ప్రభుత్వ హత్యగా గుర్తించి అతని కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షలు ఎక్స్ గ్రేషియో చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.తమ ప్రభుత్వం అవినీతికి మధ్య దళారీ వ్యవస్థకు వ్యతిరేకంగా దోపిడీ లేని వ్యవస్థను ఏర్పాటు చేయడానికి ఆప్కాస్‌ను ఏర్పాటు చేశామని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అట్టహాసంగా జివో 136 ని విడుదల చేసిందన్నారు. ఆ జివోకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం క్లాప్ వాహనాలు తన బంధువులకు కాంట్రాక్ట్ ఇవ్వడం జిఓకి విరుద్ధం అన్నారు. క్లాప్ కాంట్రాక్టర్లు రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కొక్కరు నుండి లక్షన్నర నుండి రెండు లక్షల వరకు డిపాజిట్ల రూపంలో తీసుకున్నారన్నారు. జాయింట్ లేబర్ కమిషనర్ విశాఖపట్నం ఆదేశాల ప్రకారం ప్రభుత్వ జివో 7 ప్రకారంగా రూ.18,500 చెల్లించాల్సి ఉండగా రూ. 8 వేల నుండి రూ.15 వేలు వేతనాలు చెల్లించడం సిగ్గుచేటు అన్నారు. డిపాజిట్ లకి నెలకు వడ్డీ రూపంలో రూ.3 వేలు, ట్రాన్స్‌పోర్టు, టి,టిఫిన్‌లకు నెలకి రూ.3 వేలు ఖర్చులకు పోగా మిగిలిన దానితో కార్మికులు ఏ రకంగా సంసారాలను గడుపుతారని, ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో నాలుగోవంతు మందికి పిఎఫ్,ఈఎస్ఐ లు చెల్లిస్తున్నట్టుగా చెప్తున్నా.. ఎక్కడా అమలు కాలేదన్నారు.దోపిడీ చేస్తున్న కాంట్రాక్టర్ పై వెంటనే చర్యలు తీసుకోవాలని, కాంట్రాక్టును రద్దు చేసి క్లాప్ డ్రైవర్లలందరిని ఆప్కాస్‌లో చేర్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ముందుగా ప్రొద్దుటూరు మున్సిపాలిటీ క్లాప్ డ్రైవర్ ఆంజనేయులు చిత్రపటానికి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో క్లాప్ డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి.అనిల్ కుమార్ పాల్గొన్నారు.

అనకాపల్లి: పొద్దుటూరులో ఆత్మహత్య చేసుకున్న క్లాప్ డ్రైవర్ కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియాచెల్లించాలని కోరుతూ జీవిఎంసి అనకాపల్లి జోనల్ కార్యాలయం వద్ద మున్సిపల్ క్లాప్ డ్రైవర్లు సోమవారం ధర్నా చేశారు. ముందుగా క్లాప్ డ్రైవర్ ఆంజనేయులకు జీవీఎంసీ క్లాబ్ డ్రైవర్స్ నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ ప్రొద్దుటూరు క్లాప్ డ్రైవర్‌ది ఆత్మహత్య కాదని, అది ప్రభుత్వ హత్యేనని మండిపడ్డారు. 16 రోజులు సమ్మె చేసినా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడంతో నిరాశగా ఆత్మహత్యకు పాల్పడ్డాడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జలగడుగుల శివ కుమార్, ఎ.ఏసు, బొమ్మల రాము, సత్తేష్, దుర్గారావు, శివకుమార్, అజయ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.